

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 05-01-2026 | సంపుటి - 26 | సంచిక -229 | రూ : 4 | పేజీలు: 8

## వెనెజువెలా..
## తాత్కాలిక అధ్యక్షురాలిగా రోడ్రిగ్జ్?



2లో

- 90 రోజులపాటు అధికారంలో ఉండనున్న నేత
- ఆమే అధికారం చేపట్టాలన్న ఆ దేశ సుప్రీం కోర్టు
- గుర్తిస్తున్నట్లు ప్రకటించిన సైన్యం
- ఆమె ఆధ్వర్యంలోనే పాలన కొనసాగించే అవకాశం
- అమెరికా అధికారుల నిర్బంధంలో నికోలస్ మదురో

2లో




2లో

## భోగాపురం ఎయిర్‌పోర్టుకు తొలి విమానం

- మంత్రి నారా లోకేశ్ స్పందన
- భోగాపురం ఎయిర్‌పోర్టులో విజయవంతంగా తొలి విమానం ల్యాండింగ్
- ఢిల్లీ నుంచి వచ్చిన విమానంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, అధికారులు
- రన్‌వే, సిగ్నలింగ్ వ్యవస్థలను పరీక్షించేందుకు ట్రయల్ రన్ నిర్వహణ




2లో

## కృష్ణా జలాలపై త్వరలో
## అన్ని విషయాలు మాట్లాడతా

- రాయలసీమ లిఫ్ట్ పనులను ఆపింది తానేనని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్య
- రేవంత్ వ్యాఖ్యలతో చెలరేగిన దుమారం
- కృష్ణా జలాలపై త్వరలోనే వాస్తవాలు వివరిస్తానన్న సీఎం చంద్రబాబు

## దేవుడి మీద ఒట్టు..
## ఇదే నా కమిట్ మెంట్ : సీఎం

- కేసిఆర్ మాటలతోనే చంద్రబాబు బనకచర్ల ప్రతిపాదన చేశారన్న సీఎం రేవంత్ రెడ్డి
- తెలంగాణ ప్రయోజనాలకు భిన్నంగా తాను ఎప్పటికీ వ్యవహరించనని వెల్లడి
- తనకు సొంత ప్రాంత ప్రయోజనాల తర్వాతనే పార్టీ అని పేర్కొన్న రేవంత్ రెడ్డి



2లో



2లో

## మన 'తేజస్' యుద్ధ విమానం
## తొలి గగన విహారానికి 25 ఏళ్లు

- స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన తేజస్ విమానం
- 2001 జనవరి 4న బెంగళూరులో తొలిసారి నింగికెగిసిన యుద్ధ విమానం
- శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల కృషిని కొనియాడుతూ ఐఏఎఫ్ ట్వీట్

## ఘోస్ట్ సిమ్‌లు, డ్యూయల్ ఫోన్, ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లు..
## ఢిల్లీ పేలుళ్ల కేసులో ఆసక్తికర అంశాలు వెల్లడి

- ఎర్రకోట పేలుడు కేసు దర్యాప్తులో కీలక పురోగతి
- 'ఘోస్ట్ సిమ్'లు వాడి పాక్ హ్యాండ్లర్లతో మాట్లాడిన నిందితులు
- గుర్తుపట్టకుండా ఉండేందుకు 'డ్యూయల్ ఫోన్' విధానం
- ఉగ్రకుట్రతో వాట్సాప్, టెలిగ్రామ్ నిబంధనలు మార్చిన కేంద్రం

2లో



## సోమనాథ్..
## అచంచల విశ్వాస ప్రతీక

- ఆలయంపై దాడికి వెయ్యేళ్లయిన సందర్భంగా ప్రధాని మోదీ ప్రత్యేక వ్యాసం

2లో



## ఘోస్ట్ సిమ్‌లు, డ్యూయల్ ఫోన్, ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లు...

# ఢిల్లీ పేలుళ్ల కేసులో ఆసక్తికర అంశాలు వెల్లడి

ఢిల్లీ ఎర్రకోట సమీపంలో గతేడాది జరిగిన కారు బాంబు పేలుడు కేసు దర్యాప్తులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కీలక విషయాలు వెలుగులోకి తెచ్చింది. ఈ కేసులో అరెస్టయిన 'వైట్ కాలర్' ఉగ్రవాదులు.. పాకిస్థాన్‌లోని తమ హ్యాండ్లర్లతో మాట్లాడేందుకు 'ఘోస్ట్ సిమ్' కార్డులు, ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లను వాడినట్లు తేలింది. విచారణలో నిందితులైన వైద్యులు 'డ్యూయల్ ఫోన్' విధానాన్ని అనుసరించినట్లు ఎన్ఐఏ గుర్తించింది. ఒక ఫోన్‌ను తమ వ్యక్తిగత, వృత్తిపరమైన అవసరాలకు వాడుతూ, రెండో ఫోన్‌ను కేవలం ఉగ్ర కార్యకలాపాలకే పరిమితం చేశారు. ఈ 'టెర్రర్ ఫోన్'లో వాట్సాప్, టెలిగ్రామ్ వంటి యాప్‌ల ద్వారా పాకిస్థాన్‌లోని 'ఉకాసా', 'ఫైజాన్', 'హష్మీ' అనే కోడ్ నేమ్స్ ఉన్న హ్యాండ్లర్లతో సంప్రదింపులు జరిపారు. నకిలీ లేదా ఇతరుల ఆధార్ వివరాలతో తీసుకున్న సిమ్‌లనే 'ఘోస్ట్ సిమ్'లుగా పిలుస్తున్నారు. ఈ సిమ్ కార్డు ఫోన్‌లో లేకపోయినా ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లు పనిచేసేలా ఈ టెక్నాలజీని వాడుకున్నారు. దీనివల్ల వీరిని ట్రేస్ చేయడం కష్టంగా మారింది. హ్యాండ్లర్ల నుంచి యూట్యూబ్ ద్వారా ఐఈడీల తయారీ నేర్చుకుని దేశంలో దాడులకు ప్లాన్ చేసినట్లు తేలింది. ఈ ఉగ్ర కుట్ర వెలుగులోకి రావడంతోనే కేంద్ర టెలికమ్యూనికేషన్ల విభాగం (డాట్) గతేడాది నవంబర్‌లో కీలక నిబంధనలు తీసుకొచ్చింది. వాట్సాప్, టెలిగ్రామ్, సిగ్నల్ వంటి యాప్‌లు ఇకపై ఫిజికల్ సిమ్ కార్డు డివైజ్‌లో ఉంటేనే పనిచేసేలా చట్టం చేసింది. ఒకవేళ సిమ్ తీసేస్తే లేదా ఫోన్ మార్చితే ఆటోమేటిక్‌గా లాగౌట్ అయ్యేలా నిబంధనలు అమలులోకి వచ్చాయి. గతేడాది నవంబర్ 10న జరిగిన ఈ పేలుడులో పలువురు ప్రాణాలు కోల్పోగా, ఎన్ఐఏ విచారణను మరింత ముమ్మరం చేసింది.

## కృష్ణా జలాలపై త్వరలో అన్ని విషయాలు మాట్లాడతా

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృష్ణా నదీ జలాల వివాదంపై చేసిన వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ దుమారం రేపాయి. తన విజ్ఞప్తి మేరకే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమ ఎత్తిపోతల పథకం (ఆర్ఎల్ఐఎస్) పనులను నిలిపివేశారని రేవంత్ రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో ప్రకటించడం ఈ వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. "నా మీద ఉన్న గౌరవంతో చంద్రబాబు ఆ పనులు ఆపేశారు" అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.ఈ నేపథ్యంలో, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ వివాదంపై స్పందించారు. కృష్ణా జలాల విషయంలో అసలు ఏం జరిగిందో త్వరలోనే మీడియా ద్వారా అన్ని వాస్తవాలు వివరిస్తానని ఆయన తెలిపారు. చంద్రబాబు వివరణ తర్వాత ఈ వివాదం ఎలాంటి మలుపు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

## మన 'తేజస్' యుద్ధ విమానం తొలి గగన విహారానికి 25 ఏళ్లు

భారత రక్షణ రంగ చరిత్రలో ఇదొక సువర్ణాధ్యాయం. స్వదేశీ పరిజ్ఞానంతో, పూర్తి స్థాయి భారతీయ సాంకేతికతతో రూపొందిన తేజస్ లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎల్సీఏ) నింగికెగిసి నేటికి సరిగ్గా 25 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఆదివారం ప్రత్యేక సందేశాన్ని విడుదల చేసింది. ఏడీఏ శాస్త్రవేత్తలు, హెచ్ఏఎల్ ఇంజనీర్లు, టెస్ట్ పైలట్ల కృషి వల్లే ఈ అద్భుతం సాధ్యమైందని, ఆత్మనిర్భర్ భారత్ సాధనలో ఆకాశమే హద్దు అని ఐఏఎఫ్ కొనియాడింది. 2001 జనవరి 4న బెంగళూరులోని హెచ్ఏఎల్ ఎయిర్‌పోర్ట్ నుంచి టెక్నాలజీ డెమోన్‌స్ట్రేటర్ (టీడీ1)గా తేజస్ తన తొలి ప్రయాణాన్ని ప్రారంభించింది. వింగ్ కమాండర్ రాజీవ్ కొథియాల్ ఈ విమానాన్ని విజయవంతంగా నడిపి చరిత్ర సృష్టించారు. 1983లో పాత విమానాల స్థానంలో కొత్తవి తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రారంభమైన ఎల్సీఏ ప్రాజెక్ట్.. నేడు అత్యాధునిక తేజస్ ఎంకే1ఏ స్థాయికి ఎదిగింది. ఈ ప్రస్థానంలో తేజస్ ఎన్నో కీలక మైలురాళ్లను అధిగమించింది. 2025 చివర్లో రూ. 62,370 కోట్ల విలువైన మరో 97 తేజస్ ఎంకే1ఏ యుద్ధ విమానాల తయారీకి హెచ్ఏఎల్ ఆర్డర్ దక్కించుకోవడం విశేషం. ఇప్పటికే ఉన్న 83 జెట్ల ఆర్డర్లకు ఇది అదనం. ఇక ప్రైవేట్ రంగ భాగస్వామ్యంలో భాగంగా, హైదరాబాద్‌కు చెందిన వెమ్ టెక్నాలజీస్ తయారు చేసిన సెంటర్ ఫ్యూజ్‌లేజ్ (విమాన మధ్య భాగం)ను 2025 మే నెలలో హెచ్ఏఎల్‌కు అప్పగించారు. సాంకేతికపరంగా కూడా తేజస్ తన సత్తా చాటుతోంది. 2025 మార్చిలో తేజస్ నుంచి స్వదేశీ అస్త్ర క్షిపణిని విజయవంతంగా ప్రయోగించారు. అదే నెలలో పైలట్లకు ప్రాణవాయువు అందించే స్వదేశీ ఆక్సిజన్ సిస్టమ్ ను 50 వేల అడుగుల ఎత్తులో విజయవంతంగా పరీక్షించారు. పాతికేళ్ల ఈ ప్రయాణం భారత రక్షణ రంగాన్ని స్వయం సమృద్ధం దిశగా నడిపిస్తోంది.

## భోగాపురం ఎయిర్‌పోర్టుకు తొలి విమానం... మంత్రి నారా లోకేశ్ స్పందన

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక ముందడుగు పడింది. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం తొలిసారి విమానం ల్యాండ్ అయింది. ఢిల్లీ నుంచి వచ్చిన ఎయిర్ ఇండియా ఏ320 కమర్షియల్ వ్యాలిడేషన్ ఫ్లైట్ విజయవంతంగా భోగాపురం ఎయిర్ పోర్టులో ల్యాండ్ అయింది. ఇందులో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఇతర అధికారులు ప్రయాణించారు. విమానాశ్రయం ప్రారంభానికి ముందు రన్‌వే, నావిగేషన్ వ్యవస్థల పనితీరును పరిశీలించేందుకు ఈ ట్రయల్ రన్ నిర్వహించారు. 3.8 కిలోమీటర్ల పొడవైన రన్‌వేపై విమానం సురక్షితంగా దిగడంతో, ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులు దాదాపు 97 శాతం పూర్తయి తుది దశకు చేరుకున్నట్లు స్పష్టమైంది. ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, ఇక్కడ ఏవియేషన్ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలనేది నారా లోకేశ్ ఆలోచన అని పేర్కొన్నారు. ఈ చారిత్రక ఘట్టంపై మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ, ప్రధాని మోదీ దార్శనికతతో 201419 ఎన్డీఏ హయాంలో ప్రారంభించిన ఈ విమానాశ్రయం, 2026 జూన్ నాటికి వాణిజ్య కార్యకలాపాలకు సిద్ధమవుతుందని తెలిపారు. ఇది ఉత్తరాంధ్రను కొత్త శిఖరాలకు చేర్చుతుందని ధీమా వ్యక్తం చేశారు. సుమారు రూ.4,592 కోట్ల వ్యయంతో జీఎంఆర్ సంస్థ పీపీపీ పద్ధతిలో ఈ ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేస్తోంది. మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందించేలా దీనిని తీర్చిదిద్దారు. రానున్న

## పిన్నమనేని సాయిబాబా కుటుంబానికి అండగా నిలుస్తాం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇటీవల గుండెపోటుతో కన్నుమూసిన సికింద్రాబాద్ టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు పిన్నమనేని సాయిబాబా కుటుంబ సభ్యులను పరామర్శించారు. విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు... విమానాశ్రయం నుంచి నేరుగా సికింద్రాబాద్ లోని సాయిబాబా నివాసానికి వెళ్లారు. సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారి సాయిబాబా స్వాగతం పలికేవారని గుర్తుచేసుకున్నారు. చివరి శ్వాస వరకు పార్టీకి విధేయుడిగా పనిచేసిన గొప్ప వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వికలాంగుల కార్పొరేషన్ ఛైర్మన్‌గా సాయిబాబా చేసిన సేవలను ఆయన కొనియాడారు. సాయిబాబా కుటుంబం సమస్యల్లో ఉందని తెలిసిందని, వారికి పార్టీ అన్ని విధాలా అండగా నిలుస్తుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. పరామర్శ అనంతరం తిరిగి వెళుతుండగా, మీడియా ప్రతినిధులు తెలుగు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న కృష్ణా జలాల వివాదంపై సీఎంను ప్రశ్నించారు. దీనిపై ఆయన స్పందిస్తూ, "త్వరలోనే అన్ని విషయాలు చెబుతాను" అని క్లుప్తంగా సమాధానమిచ్చారు. ఇరు రాష్ట్రాల మధ్య నీటి వివాదం తీవ్రంగా ఉన్న తరుణంలో చంద్రబాబు చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## భోగాపురం ఎయిర్ పోర్టుకు 2014-19లోనే పనులు ప్రారంభించాం

భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి 2014-19 మధ్య ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే ప్రణాళికలు రచించి, పనులు ప్రారంభించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టులో వాలిడేషన్ ఫ్లైట్ విజయవంతంగా జరగడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర విమానయాన రంగంలో ఒక కొత్త మైలురాయి అని అభివర్ణించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరికీ ఆయన అభినందనలు తెలిపారు. ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని, ప్రాంతీయ కనెక్టివిటీని బలోపేతం చేస్తుందని అన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టులో వచ్చే జూన్ నుంచి వాణిజ్య విమాన సర్వీసులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న సహకారానికి, ఆయన దార్శనికతకు చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. భోగాపురం విమానాశ్రయంలో విమాన రాకపోకలకు సంబంధించి నిర్వహించిన వాలిడేషన్ ఫ్లైట్ విజయవంతం కావడంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేగవంతం అవుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## సోమనాథ్.. అచంచల విశ్వాస ప్రతీక

సోమనాథ్.. ఈ పేరు తలచుకుంటే చాలు మన హృదయాలు, మనసులలో సగర్వభావన నిండిపోతుంది. భారత ఆత్మకు ఇదో శాశ్వత ఉద్ఘోషణ. పశ్చిమతీరంలో గుజరాత్‌లో ప్రభాస్ పాటణ్ వద్ద ఈ మహత్తర ఆలయం కొలువైంది. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఇదొకటి. 'సౌరాష్ట్రే సోమనాథం చ' అని మొదలయ్యే స్తోత్రం.. తొలి జ్యోతిర్లింగంగా దీనికున్న ప్రాధాన్యానికి ప్రతీక. సోమనాథ్ శివలింగ దర్శనంతో పాప ప్రక్షాళన జరుగుతుందని, మరణానంతరం స్వర్గానికి చేరుతారని 'సోమలింగం నరో దృష్ట్వా సర్వపాపైః ప్రముచ్యతే! లభతే ఫలం మనోవాంఛితం మృతః స్వర్గం సమాశ్రయేత్!!' శ్లోకం మనకు చెబుతుంది. లక్షల మంది భక్తుల నీరాజనాలు అందుకున్న సోమనాథ్‌పై విదేశీ దురాక్రమణదారులు అనేక దండయాత్రలు చేశారు. ఐతిహాసిక పుణ్యక్షేత్రంపై గజనీ మహమ్మద్ క్రూర, హింసాత్మక దండయాత్ర చేసింది 1026 జనవరిలోనే. ఆలయానికి పూర్వవైభవం దిశగా అప్రతిహతంగా సాగిన కృషివల్ల వెయ్యేళ్ల తర్వాత కూడా ఆలయ దివ్యదీప్తి నేల నలుచెరగులా భాసిల్లుతోంది. ఇలాంటి ప్రయత్నాల్లో ఒక ఘట్టానికి 2026లో 75 ఏళ్లు పూర్తవుతుంది. ఆలయ పునరుద్ధరణ తర్వాత 1951 మే 11న ఆనాటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ సమక్షంలో ఆలయంలో భక్తులకు మళ్లీ దర్శనభాగ్యం కలిగింది.

**చదివితే హృదయం బరువెక్కుతుంది**

సోమనాథ్ ఆలయంపై జరిగిన దాడి, విధ్వంసాన్ని చారిత్రక గ్రంథాలు సవివరంగా నమోదుచేశాయి. అవి చదివితే మన గుండె చలించిపోతుంది. ఎంతగా హింస, క్రూరత్వం, విషాదం ఉన్నాయనేది ప్రతి వాక్యం చెబుతుంది. అవి కాలంతోపాటు చెరిగిపోనివి. సోమనాథ్‌కు ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాశస్త్యం ఉంది. మన సమాజానికిది ఎంతో గొప్ప ఆర్థిక బలాన్నిస్తోంది. నౌకావాణిజ్యం చేసేవారు ఈ ఘనతర చరితను సుదూర ప్రాంతాలకు తీసుకువెళ్లారు. తొలిదాడి జరిగిన వెయ్యేళ్ల సోమనాథ్ గాథ దాని విధ్వంసం ద్వారా కాకుండా కోట్లమంది భరతమాత బిడ్డల అచంచల ధైర్యసాహసాల ద్వారా నిర్వచించవచ్చని నేనెంతో సగర్వంగా చెప్పగలను.

## దేవుడి మీద ఒట్టు... ఇదే నా కమిట్ మెంట్: సీఎం రేవంత్ రెడ్డి

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు అంశంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభ వేదికగా ఘాటుగా సమాధానమిచ్చారు. తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా తాను ఎప్పటికీ వ్యవహరించనని స్పష్టం చేస్తూ, గత పాలకుల నిర్ణయాలే నేటి వివాదాలకు కారణమని వివరించారు. నీళ్లు - నిజాలు అనే అంశంపై శాసనసభలో జరిగిన స్వల్పకాలిక చర్చలో సీఎం రేవంత్ రెడ్డి గోదావరి జలాలు, బనకచర్ల ప్రాజెక్టు, కృష్ణా జలాల పంపకాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. గోదావరిలో మిగులు జలాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలంటూ 2016లోనే జల్‌శక్తిశాఖ సమావేశంలో అప్పటి సీఎం కేసీఆర్ మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ చెప్పిన మాటలతోనే చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు ఆలోచన చేశారని పేర్కొన్నారు. కేంద్ర జల్‌శక్తిశాఖ నిర్వహించిన సమావేశాలకు కేసీఆర్ రెండు సార్లు హాజరయ్యారని గుర్తుచేశారు. కృష్ణా జలాల పంపకాల్లో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలకు కేసీఆర్ అంగీకరించి, ట్రైబ్యునల్ తుది తీర్పు వచ్చే వరకూ అదే కొనసాగిస్తామని సంతకం చేశారన్నారు. 2020లో వాటా పెంచుకునే అవకాశం వచ్చినా అప్పటి ప్రభుత్వం ఉపయోగించుకోలేదని విమర్శించారు. నాకు నా ప్రాంతమే ముఖ్యం. ఆ తర్వాతనే పార్టీ. అందుకే అప్పట్లో బయటకు వచ్చా. సీఎం కుర్చీలో కూర్చొని తెలంగాణకు అన్యాయం జరిగేలా నేను ఎప్పుడూ ప్రవర్తించను'' అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ఆపించిన చరిత్ర తమదేనని తెలిపారు. ఆ పనులు నిలిపివేస్తేనే చర్చలకు వస్తామని స్పష్టమైన షరతు పెట్టామని చెప్పారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ నిజంగా ఆగిందో లేదో నిజనిర్ధారణ కమిటీ ద్వారా విచారణ చేయించుకోవచ్చని సవాల్ విసిరారు. ''చచ్చినా.. బతికినా.. తెలంగాణ కోసమే. ఇదే నా కమిట్‌మెంట్. దేవుడి మీద ప్రమాణం చేసి చెబుతున్నా.. తెలంగాణకు అన్యాయం జరగనివ్వను'' అని సభలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంగా ప్రకటించారు.

## వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా రోడ్రిగ్జ్?

కారకాస్, న్యూయార్క్, వాషింగ్టన్: వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా ఉపాధ్యక్షురాలు, చమురు, ఆర్థికశాఖల మంత్రి డెల్సీ రోడ్రిగ్జ్ బాధ్యతలు చేపట్టినట్లు తెలుస్తోంది. వెనెజువెలా చట్టాల ప్రకారం.. ఆమే బాధ్యతలు చేపట్టాలని సుప్రీం కోర్టు సూచించడం, దేశ సైన్యం ఆమెకు మద్దతుగా నిలిచిన నేపథ్యంలో రోడ్రిగ్జ్ అధికార బాధ్యతలు తీసుకున్నట్లు సమాచారం. అయితే అధికారికంగా ఎక్కడా దీనిపై ప్రకటన వెలువడలేదు. 90 రోజులపాటు ఆమె అధికారంలో ఉంటారని రక్షణ మంత్రి పాడ్రినో ప్రకటించినట్లు సమాచారం. మదురోను వదిలేయాలని అమెరికాను వెనెజువెలా ఉపాధ్యక్షురాలు, తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారంటున్న డెల్సీ రోడ్రిగ్జ్ డిమాండు చేశారు. ఆయన దేశానికి చట్టబద్ధ నేతని శనివారం సాయంత్రం స్పష్టంచేశారు. 'దేశానికి ఒకరే అధ్యక్షులుగా ఉన్నారు. ఆయనే మదురో' అని అత్యున్నత పౌర, సైనికాధికారుల మధ్య ఆమె స్పష్టం చేశారు. ఆమె మాట్లాడిన సమయంలో టీవీ ఛానళ్లలో కింద స్క్రోలింగ్ భాగంలో ఉపాధ్యక్షురాలనే వచ్చింది. మరోవైపు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియోతో డెల్సీ రోడ్రిగ్జ్ సమగ్ర చర్చలు జరిపారని డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. 'మీకేం కావాలో అది చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఆమె దయగల వ్యక్తి. వెనెజువెలా బాధ్యతలను వేరేవారికి అప్పగించే ఛాన్స్ తీసుకోం. అది ఆ దేశ ప్రజలకు మంచిది కాదు' అని ట్రంప్ స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత మచాడోకు దేశంలో పెద్దగా మద్దతు లేదని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు డెల్సీకి అమెరికాతో సంబంధాలున్నట్లు తెలుస్తోంది. చమురు పరిశ్రమలోని రిపబ్లికన్లతో, వాల్‌స్ట్రీట్‌తోనూ ఆమెకు మంచి సంబంధాలే ఉన్నట్లు సమాచారం. దీనినిబట్టి వెనెజువెలా అధ్యక్షురాలిగా డెల్సీ కొనసాగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

**మదురో తరలింపు**

అమెరికా మదురోను న్యూయార్క్‌కు చేర్చింది. శనివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో ఆయనను, ఆయన భార్య సిలియా ఫ్లోర్స్‌ను నగరంలోని ఉత్తర ప్రాంతంలో ఉన్న ఓ చిన్న విమానాశ్రయానికి తీసుకొచ్చింది. వారిని తీసుకొచ్చిన విమానానికి అమెరికా జెట్లు రక్షణగా వచ్చాయి. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మన్‌హటన్‌కు తరలించారు. అక్కడ వేచి ఉన్న కాన్వాయ్‌తో మదురోను అమెరికా డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయానికి తీసుకెళ్లారు. ఈ ఇద్దరిపై 'నార్కోటెర్రరిజం' అభియోగాలను మోపిన అమెరికా.. బ్రూక్లిన్ జైలులోనే విచారించి శిక్ష విధించనుంది. శ్వేతసౌధం విడుదల చేసిన వీడియోలో మదురో నవ్వుతూ కనిపించారు. అమెరికా అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక (శనివారం తెల్లవారుజామున) వెనెజువెలా రాజధాని కారకాస్‌లో అమెరికా చేసిన దాడిలో పౌరులు, సైనికులతోసహా కనీసం 40 మంది మరణించారని ఓ మీడియా సంస్థ తెలిపింది. మదురో, ఆయన భార్య సిలియాపై నార్కోటెర్రరిజం కుట్ర, కొకైన్ దిగుమతి, మెషీన్ గన్స్, విధ్వంసకర ఆయుధాలను కలిగి ఉండటం వంటి అభియోగాలను మోపుతున్నారు. డ్రగ్స్ రవాణా చేసేవారి కిడ్నాప్‌లు, దాడులు చేయడంవంటి కేసులనూ పెట్టారు. వారు డబ్బులు ఇవ్వకపోవడంతో వారిని హింసించేవారని అభియోగాలు మోపారు. అమెరికా ఆపరేషన్ చట్టబద్ధతపై న్యాయ నిపుణులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. కాంగ్రెస్ అనుమతి లేకుండా చేయడాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. అనేక అంతర్జాతీయ చట్టాలను అమెరికా ఉల్లంఘించిందని న్యాయ నిపుణుడు ఇలాన్ కట్జ్ అభిప్రాయపడ్డారు. వెనెజువెలా పడవలపై దాడులు చేయడాన్ని ఇప్పటికే అమెరికా కాంగ్రెస్‌లోని రెండు పార్టీల సభ్యులు ఖండించారు. ఇప్పుడు వారికి తెలియకుండా విరుచుకుపడటం, అధ్యక్షుడిని తీసుకురావడంపై ఎలా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

# మే రెడ్డి సత్యనారాయణ రెడ్డి సేవలు మరువలేనివి

**- ఆశ్రమ అధ్యక్షుడు దెబ్బటి అశోక్**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మే రెడ్డి సత్యనారాయణరెడ్డి సేవలు మరువలేనివని సాయి యాదాద్రి సేవా సంస్థ వృద్ధాశ్రమం అధ్యక్షుడు దెబ్బటి అశోక్ అన్నారు. చౌటుప్పల్ మండలం పెద్ద కొండూరు గ్రామంలో మేరెడ్డి సత్యనారాయణ వృద్ధాశ్రమ నెలకొల్పి వ్యవస్థాపక అధ్యక్షులుగా ఉండి ఆశ్రమాన్ని సాయి యాదాద్రి సేవ సంస్థకు నిర్వహణ కోసం అందజేశారని తెలిపారు. సంస్థ సేవలు ఫిబ్రవరి 9న, 2020 సంవత్సరం నుండి రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుల సహకారంతో సాయి యాదాద్రి సేవా సంస్థ వారు బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల సహకారంతో నెలకొల్పి సేవలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వృద్ధాప్య కారణాలతో గత సంవత్సర డిసెంబర్ 21న మే రెడ్డి సత్యనారాయణ మరణించారని తెలిపారు. ఆయన మరణ సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఆదివారం సంతాప సంస్మరణ సభను ఆశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ అధ్యక్షుడు అశోక్ దివంగత మే రెడ్డి సత్యనారాయణ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ రెడ్డి వృద్ధులకు సేవలు అందించాలని కృతనిచ్చేయంతో తమకు ఆశ్రమాన్ని అందజేశారని తెలిపారు. వారి ఆలోచనకు అనుగుణంగా వారు చూపించిన దారిలోనే ఆత్మకు శాంతి చేకూరే విధంగా మేము సేవలందిస్తామని తెలిపారు. సభ్యులంతా రెండు నిమిషాలు మౌనం పాటించారు. వారు సేవలోనే కాకుండా అనేక రచనలు కూడా రాశారని అందులో శ్రీ నరసింహ కథ కావ్యం, చెంచపురి, మనిషి మానవత్వం, వేదాద్రి శతకం, స్వార్ధక జీవనం, మేరెడ్డి భాగవతం, మానవ జీవనంలో ఆధ్యాత్మిక కోణం వంటి పుస్తకాలు రచించారని తెలిపారు. ఆశ్రమ సభ్యులమంతా ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కోటి సంపూర్ణ భాగవత్ పారాయణం లో భాగంగా శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ భక్త బృందం పారాయణం నిర్వహించారు. ఆయన రచించిన పుస్తకాలను ప్రచురించి పలువురికి అందజేశారు. ఈ కార్యక్రమంలో దివంగత మే రెడ్డి సత్యనారాయణ భార్య జానకమ్మ, కూతుర్లు వినీత, కల్పన, కుటుంబ సభ్యులు అదేవిధంగా వృద్ధాశ్రయ ఆశ్రమ ప్రధాన కార్యదర్శి జెవైశెట్టి, ఆశ్రమ సభ్యులు నేరెళ్ల కోటేశ్వరరావు, డాక్టర్ రాజు సుధాకర్, పాటి యాదిరెడ్డి, కళ్లెం బాల్ రెడ్డి, రెడ్ క్రాస్ సభ్యులు బాలాజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ మహేష్, జాయింట్ సెక్రెటరీ రాజేందర్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, అప్పలరాజు, శశాంక్ కుమార్, హనుమాన్, ఏ కోటేశ్వరరావు, రాజేశ్వర్ రాజు, సుధాకర్ రావు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొని సంతాపాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి

**: కోలన్ హన్మంత్ రెడ్డి**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : కాలనీ లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కోలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 274 డివిజన్ బాచుపల్లి పరిధిలోని కాకతీయ నగర్ కల్చరల్ అసోసియేషన్ వాసులు అభివృద్ధి అంశాలపై ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ బొంపల్లి విజయ్, వైస్ ప్రెసిడెంట్ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, జనరల్ సెక్రటరీ వినోద్ కుమార్ ముివ్వా, ట్రేసురేర్ దశరథం బండి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోల సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, ఆలేటి శ్రీనివాస్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ కు వినతి



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పలు ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, సంక్షేమ సంఘాల సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు, బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## మైండ్ మేనేజ్మెంట్, మానసిక ప్రశాంతత, ధ్యానం అంశంపై ప్రత్యేక సదస్సు



చందానగర్, (ప్రజాస్ఫూర్తి) : మానసిక క్రమశిక్షణ, ఏకాగ్రత, ధ్యానం వ్యక్తిగత జీవితం తో పాటు వృత్తిపరమైన విజయాలకు ఎంతో ముఖ్యమని ఇస్రో శాస్త్రవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత గాంధీ అన్నారు. చందానగర్‌లో అపర్ణ లేక్ బ్రీజ్ అపార్ట్మెంట్స్ మైండ్ మేనేజ్మెంట్, మానసిక ప్రశాంతత , ధ్యానం ప్రాముఖ్యతపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా "మైండ్ మేనేజ్మెంట్, మానసిక ప్రశాంతత & ధ్యానం" అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు క్రాంతి లక్ష్మి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ జీవన అనుభవాలు, ధ్యాన ప్రాధాన్యం, రోజువారీ జీవితంలో ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో విలువైన సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో రాందేవ్ రావు హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ , డా. కమలాకర్, రేకి గ్రాండ్ మాస్టర్ లక్ష్మి, శాస్త్రి, సుబ్రహ్మణ్యం , అపర్ణ లేక్ బ్రీజ్ అపార్ట్మెంట్స్ నివాసులు, రామదేవరావు హాస్పిటల్‌కు చెందిన అన్ని విభాగాల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ధర్మోజీ గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మాకు ఘన సన్మానం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం ధర్మోజీ గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మాకు 200506పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఘనంగా సన్మానించారు. కొయ్యలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 200506పదో తరగతి బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు తమతో పాటు కలిసి చదువుకున్న స్నేహితుడు జువ్వి నర్సింహ్మా సర్పంచ్ గా గెలుపొందడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తమ స్నేహితుడు సర్పంచ్ కావడం సంతోషంగా ఉందన్నారు. ధర్మోజి గూడెం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. స్వీట్లు పంపిణీ చేశారు. ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురుగు మురళి, వనం రమేష్, గుర్రం రాఘవేంద్ర, రాచకొండ బాలరాజు, ఊదరి ప్రసాద్, కైరంకొండ శ్రీనివాస్, ఈడెం రవి, చిన్నం శ్రవణ్, జాల మల్లికార్జున్, ఊదరి మురళి, ఎర్రగుంట లింగస్వామి, వర్కాల సుదర్శన్, పుట్ట రాజేష్, మిర్యాల రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

**: టిడబ్ల్యూజెఎఫ్**

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : మేడ్చల్ జిల్లా పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని టిడబ్ల్యూజెఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కట్టెల మల్లేశం, గడ్డమీది అశోక్ లు అన్నారు. ఆదివారం షాపూర్ నగర్ ఉషోదయ టవర్ లో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఇల్లు, ఇళ్లస్థలాలు కేటాయించాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్న అక్రిడేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. అనేక మంది జర్నలిస్టులు అనారోగ్యంతో బాధపడుతున్నారన్నారు. వారికి వెంటనే హెల్త్ కార్డులు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు.విద్యాశాఖ అధికారులు జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య అందించాలని తెలిపారు. చిన్న పత్రికలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి ఎమ్ ప్యానల్ మెంట్లో చేర్చాలన్నారు. వ్యాపార ప్రకటనలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. జిల్లాల్లో మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నివారణకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కోశాధికారి అమరేందర్ గౌడ్, సహాయ కార్యదర్శి పి.శంకర్, చిన్నబాబు, బాలరాజు, చైతన్య రెడ్డి, రఫియూద్దీన్ ఖాద్రి, రమేష్, కొండల్ రెడ్డి, పర్వేజ్ ఆహ్మద్, లింగారెడ్డి, సంతోష్ రెడ్డి, సౌభాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఆది మహావిష్ణు దేవాలయం హుండీ లెక్కింపు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారంలో ఉన్న స్వయంభూ శ్రీ ఆదిమహావిష్ణు దేవాలయం హుండీని ఆదివారం లెక్కించారు. ఇటీవల బ్రహ్మోత్సవాలు జరిగిన విషయం విధితమే. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో హుండీని లెక్కించగా రూ.1,62,000ల ఆదాయం చేకూరిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ వరకాంతం జంగారెడ్డి, సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్, గట్టు సుధాకర్, కోయగూర బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జంగం శ్రీనివాస్ రెడ్డి, పన్నాల రాజు రెడ్డి, బొమ్మ మైసయ్య, వార్డ్ మెంబర్ ఊదరి రమేష్, అత్తాపురం వెంకట్ రెడ్డి, దానయ్య సాలయ్య, రాము, సత్తయ్య, మనోహర్ గుప్త, శ్రీను, రాములు, బిక్షపతి, శ్రీను, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఆయుర్వేద మూలికా వైద్య సర్టిఫికెట్ అందుకున్న సుగుణారావు

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: హైదరాబాద్ అజీజ్నగర్ లోని, తెలంగాణ మెడిసినల్ ప్లాంట్స్ బోర్డు కేంద్రంలో ఆదివారం సాయంత్రం , ప్రముఖ ప్రకృతి వైద్యులు హీలర్. జి.సుగుణారావుకు ఆయుర్వేద పరంపర మూలికా వైద్య సర్టిఫికెట్ ను అందచేశారు. తెలంగాణా మెడిసినల్ ప్లాంట్స్ బోర్డు, తెలంగాణా బయోడైవర్సిటీ బోర్డు, ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం, తెలంగాణ చాప్టర్ ఆయుష్ యునాని మెడికల్ ఆఫీసర్స్ వింగ్, ఆల్ హెర్బల్ ట్రెడిషనల్ ప్రాక్టీషనర్స్ ఆర్గనైజేషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన్ డే లైవ్ డిమాన్ట్రేషన్ ఆఫ్ మెడిసినల్ ప్లాంట్స్ అండ్ ఇంటరాక్షన్ లో పాల్గొన్నందుకు ఆయనకు ఈ సర్టిఫికెట్ ను అందించారు.ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం అధ్యక్షులు సింహాచలం లక్ష్మణస్వామి, ప్రధాన కార్యదర్శి ఆచార్య పసుల హరీష్ దైవజ్ఞ, సలహాదారులు మొక్కల వెంకటయ్య, రవితేజ, జె.ఎం. రాజు ల చేతుల మీదుగా అందుకున్నారు. కాగా ప్రముఖ ప్రకృతి వైద్యులు డా. రామచంద్ర, డా. పద్మ లు అతిథులుగా పాల్గొన్నారు.




## మున్సిపల్ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

**- ఎండి జహంగీర్**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ కోరారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం అమరజీవి కందాల రంగారెడ్డి స్మారక భవనంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు బండారు నరసింహ, సిపిఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ ల అధ్యక్షతన చౌటుప్పల్ మున్సిపల్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ హాజరై మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులుగా, పనిచేసిన గ్రామాలలో నిజాయితీగా, నిస్వార్థంగా, గ్రామాల అభివృద్ధికై పాటుబడిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, ఉందని గుర్తు చేశారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పార్లమెంటు సమావేశాలలో అడ్డదారిగా మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్ లను విద్యుత్ సవరణ బిల్లులను, జి రాం జీ బిల్లులను, న్యూక్లియర్ రియాక్టర్లకు ,ప్రైవేటు వ్యక్తులకు అవకాశం కల్పించడం లాంటివి వెంటనే విరమించుకోవాలని వాటి పరిణామాలు దేశ ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగించబోతున్నాయన్నారు .ఈ లేబర్ కోడ్ ల వలన కార్మికులు సమ్మె హక్కును, కోల్పోతున్నారని ఉద్యోగ భద్రత ఉండదని, కనీస వేతనాల కోసం కార్మికులు బేరసారాలు ఆడే హక్కును కోల్పోతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చక కాలయాపన చేస్తుందని అన్నారు. కావున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వెలికి తీసి సమస్యల సాధనకై పోరాటం చేసే కమ్యూనిస్టులను ఎన్నికల్లో గెలిపిస్తే గ్రామాలు, మున్సిపాలిటీల, అభివృద్ధికై నిస్వార్థ సేవ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. కావున జరగబోయే ఎన్నికల్లో మద్యానికి, డబ్బులకు, లొంగక ప్రజలు ఆలోచించి ఓట్లు వేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, అవ్వారి రామేశ్వరి, నాయకులు గోపగోని లక్ష్మణ్ గౌడ్, దండ అరుణ్ కుమార్, బత్తుల దాసు, ఉష్కాగుల శ్రీనివాస్, ఎండి ఖయ్యూం, బొడ్డు అంజిరెడ్డి, గుణమోని ఐలయ్య, బొడ్డు రాజు, తొర్పునూరి మల్లేశం, చికూరి ఈదయ్య, సిలువేరు జంగయ్య, భావనలపల్లి స్వామి, కనకయ్య, రాములు, సప్పిడి శ్రీనివాసరెడ్డి, చింతకింది పాండు, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల పాలిట సీఎం సహాయనిధి వరం

**- చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అనారోగ్యాల బారిన పడిన నిరుపేదల పాలిట సీఎం సహాయనిధి వరంలాంటిదని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో 13వ వార్డుకు చెందిన మాధగోని సుగుణమ్మకు మంజూరైన రూ.75వేల విలువైన ఎల్ ఓ సి చెక్కును ఆదివారం మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజుతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యం బారిన పడిన ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేందుకు ముందస్తుగా ఎల్ఓసి అందజేయడం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల ప్రభుత్వమన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో అందిస్తున్న సీఎం సహాయ నిధిని ప్రజల సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మొగుదాల రమేష్ గౌడ్, వర్కాల కుమార్ గౌడ్, తొర్పునూరి రవి గౌడ్, మారగోని నరసింహ, తొర్పునూరి బాబు, గోశిక వినయ్, బాతరాజు సింహాద్రి, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## సమన్వయంతో పని చేస్తే అద్భుత ఫలితాలు

**: కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వ ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తే జిల్లాలో అద్భుత ఫలితాలు సాధించవచ్చు అని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. టీఎన్జీవో, టీజీవో, ట్రస్మా ఆధ్వర్యంలో పాల్వంచ లోని ఓ గార్డెన్ లో ఆదివారం నిర్వహించిన 'ప్రగతి టుగెదర్' కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ప్రధానంగా పంచాయతీరాజ్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లాలో ఇప్పటివరకు సాధించిన ప్రగతికి సంబంధించిన అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. జిల్లా అభివృద్ధికి కావలసిన వనరులు పుష్కలంగా ఉన్నాయని.. వాటిని ఉపయోగించుకోవడంలో వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మునగ, అజోల్ల, సమీకృత వ్యవసాయం, కొర్రమీను, కంజు పిట్టల పెంపకం, బయోచార్, ఇటుకల తయారీ వంటి వాటిల్లో మెరుగైన ఫలితాలు సాధించామని అన్నారు. వీటిపై మరింత దృష్టి సారిస్తే జిల్లా రైతాంగం ఆర్థికంగా అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ. .. గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతి ఒక్కరికి తెలిసేలా వినూత్న కార్యక్రమం చేపట్టామన్నారు. ఇప్పటికే గిరిజన విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించేందుకు కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాం విజయవంతంగా కొనసాగిస్తున్నామన్నారు. గిరిజన మ్యూజియాన్ని ఆధునికరించి సందర్శకుల సంఖ్యను పెంచినట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీఓ మధు, జిల్లా పరిషత్ సీఈవో నాగలక్ష్మి వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రానున్న వారం రోజులు ఇదీ పరిస్థితి



రాష్ట్రంలో రాగల మూడు రోజులు కొన్ని ప్రాంతాల్లో పొగమంచు ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ పొగమంచు ప్రభావం ఎక్కువగా ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా పొగమంచు కారణంగా కొన్ని ప్రాంతాలు ఊటీని తలపిస్తున్నాయి. ఉదయం 9 గంటలు దాటినా సూర్యరశ్మి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. పలు చోట్ల ఉదయ వేళల్లో సమీప దూరంలో ఉన్న వాహనాలు కూడా కనిపించక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. పొగమంచు ప్రభావం తెల్లవారుజామున 3 గంటల నుండి 8 గంటల వరకు కొనసాగుతోందని వాతావరణ శాఖ పేర్కొంది. రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రత 11.1 డిగ్రీలు సంగారెడ్డి జిల్లా కోహిర్ లో నమోదైనట్లు పేర్కొంది. అలాగే రాష్ట్రంలో శీతల గాలుల ప్రభావం కారణంగా ఈ నెల 8 వరకు ఆదిలాబాద్, కుమరం భీం, మంచిర్యాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఐదు డిగ్రీల మేర కనిష్ట ఉష్ణోగ్రతలు పెరిగినట్లు వాతావరణ శాఖ తెలిపింది. తూర్పు, ఆగ్నేయ దిశల నుండి తేమ గాలులు ప్రవేశించడం వల్ల దట్టమైన పొగమంచు కమ్మేస్తుందని పేర్కొంది. రాగల మూడు రోజులు ఉత్తర గాలులు ప్రారంభమై తెలంగాణలోని ఉత్తర, మధ్య జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోయి చలితీవ్రత పెరిగే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ పేర్కొంది.

## మెట్రో అలర్ట్.. అవి నిషేధం



హైదరాబాద్ మెట్రో రైలు రవాణా సంస్థ బిగ్ అలర్ట్స్. ప్రయాణికుల భద్రతను ముఖ్యంగా పరిగణలోకి తీసుకొని హైదరాబాద్ మెట్రో మరో నిబంధనను విధించింది. మెట్రో రైల్వే స్టేషన్ల పరిసర ప్రాంతాల్లో, అలాగే మెట్రో రైలు పట్టాల సమీపంలో గాలి పటాలు ఎగరేయడాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు తెలిపింది. గాలి పటాల దారాలు మెట్రో రైళ్లకు, ఓవర్‌హెడ్ ఎలక్ట్రిక్ వైర్లకు చిక్కితే రైలు సేవలు నిలిచిపోవడమే కాకుండా, తీవ్ర ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. గతంలో కూడా పతంగుల కారణంగా మెట్రో సేవల్లో చిన్నపాటి అంతరాయాలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. అందుకే ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ నిషేధం అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజలు, ముఖ్యంగా పిల్లలు, యువత ఈ విషయాన్ని గమనించి మెట్రో నిబంధనలకు సహకరించాలని హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ కోరింది.

## నటుడుగా అలరించిన పోలయ్య కవి

*** పాపారాయుడు పాత్రలో అబ్బురపరిచారు**







(హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి) : కవిత్వం తో అలరించిన కవి పోలయ్య ఇప్పుడు నటుడుగా అందరి అభిమానం చురగొన్నారు. శ్రీ త్యాగరాజ గాన సభలో మహర్షి వాల్మీకి సంస్థ ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షులు డా.వి డి రాజగోపాల్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన రాసిన "ఎర్ర సింధూరం యాడబాయ తల్లి" నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. శేఖర్ బాబు దర్శకత్వం వహించిన ఈ నాటకంలో ఒక ప్రధానమైన "పాపారాయుడు పాత్రలో " ప్రముఖ కవి పోలయ్య కూకట్లపల్లి అందమైన గెటప్ తో చక్కని హావభావాలతో... ఆకట్టుకునే డైలాగ్ లతో అద్భుతంగా నటించి ప్రేక్షకులను అలరించారు.మరో ప్రముఖమైన భూపతిరాయుడి పాత్రలో సాధనాల వేంకట స్వామి నాయుడు చెన్నమ్మ పాత్రలో సురభి ప్రియాంక జీవించారు. ఇంకా ఇతరత్రా పాత్రల్లో శ్రీరాం చంద్రశేఖర్ కుమార్ అరవా, డా. శాంతిశ్రీ, డా. రాధా కుసుమ మోచర్ల అందరూ తమ నటనా చాతుర్యాన్ని ప్రదర్శించారు. శరత్ చంద్ర సందర్భోచితమైన సంగీతం అందించారు. ప్రతి ఒక్కరూ నాటకం విజయవంతం కావడానికి ప్రాణం పెట్టారు. సభకు అతిరథ మహారథులు హాజరై నాటకాన్ని ఆద్యంతం ఆసక్తికరంగా వీక్షించి ఆనందించారు. డా. వి.డి రాజగోపాల్ అతిథులందరినీ స్పెషల్ గిఫ్ట్ బ్యాక్ లతో సత్కరించారు. అలాగే ఆరంభంలో అరవా రవీంద్రబాబు నిర్వహణలో జరిగిన కవిసమ్మేళనంలో కవితాగానం చేసిన కవులను నటులను శాలువాలతో అందమైన మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాపారాయుడు పాత్రకు న్యాయం చేసిన పోలయ్య కూకట్లపల్లిని డా. విడి రాజగోపాల్, కళారత్న డా బిక్కి కృష్ణ, సినీ డైరెక్టర్ రేలంగి నరసింహారావు లు ఘనంగా సన్మానించారు.

## చౌటుప్పల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా వాకిటి నర్సింహ్మారెడ్డి నియామకం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ పట్టణంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది (ఏజీపీ) గా వాకిటి నర్సింహ్మారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నర్సింహారెడ్డి స్వస్థలం చౌటుప్పల్ మండలంలోని పెద్ద కొండూరు గ్రామపంచాయతీ పరిధిలోని తమ్మలోనిబావి. తన న్యాయవిద్యను ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ లో పూర్తి చేయడం జరిగింది. 2010లో తెలంగాణ బార్ కౌన్సిల్ లో నమోదు చేసుకొని, రంగారెడ్డి జిల్లా కోర్టులో తన ప్రాక్టీసును ప్రారంభించారు. 2010వ సంవత్సరం నుంచి న్యాయవాదిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో 2021లో చౌటుప్పల్ లో కోర్టు ఏర్పాటు చేయడంతో, తన ప్రాక్టీసును చౌటుప్పల్ లో మొదలుపెట్టారు. చౌటుప్పల్ బార్ అసోసియేషన్ తెలంగాణ బార్ కౌన్సిల్ లో గుర్తింపు పొందిన అనంతరం జరిగిన మొట్టమొదటి ఎన్నికల్లో చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా గెలుపొందారు. ఈ సందర్భంగా వాకిటి నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి, అదేవిధంగా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తాను బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఉన్న సమయంలోనే చౌటుప్పల్ కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది (ఏజీపీ)ని ఏర్పాటు చేయాలని అప్పటి న్యాయశాఖ కార్యదర్శికి పలుమార్లు వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చౌటుప్పల్ కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది (ఏజీపీ) పోస్టును ఏర్పాటు చేయడం, రాష్ట్ర ప్రభుత్వం చౌటుప్పల్ కోర్టుకు మొదటి ప్రభుత్వ న్యాయవాది (ఏజీపీ)గా తనను నియమించడం సంతోషంగా ఉందన్నారు.



## ఘనంగా ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు జన్మదిన వేడుకలు





కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు జన్మదిన వేడుకలు నాయకులు, అభిమానులు, కార్యకర్తల మధ్య ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. శంబీపూర్ గ్రామంలోని ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన వేడుకలలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి ఆయన చేత కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వారిని శంభీపూర్ లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు, గజమాల, పూల బోకేలు, మొక్కలు ఇచ్చి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా 295 భౌరంపేట్ డివిజన్ ఇందిరమ్మ కాలనీ లో కాలనీ ప్రెసిడెంట్ కామేశ్వరరావు ఆధ్వర్యంలో భౌరంపేట్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పేదలకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, మాజీ పాక్స్ డైరెక్టర్ మిద్దెల బాల్ రెడ్డి, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్వి. సురేందర్ రెడ్డి , సర్గారి ధర్మారెడ్డి , భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి , నాయకులు బండ మహేందర్, జిన్నారం వెంకటేష్ గౌడ్, భూషణ్, శ్యామ్, బాబీ, దిలీప్, బాబు, ఎల్లయ్య , కోటయ్య, తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్సీకి జన్మదిన శుభాకాంక్షలు**

మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు జన్మదినం సందర్భంగా శంభీపూర్ లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకలకు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీద బాలరాజ్, కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గోలిపల్లి దయాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిబాబా,కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ కోశాధికారి శర్మ, గణేష్ రెడ్డి, సంతోష్ రెడ్డిలు కలిసి శాలువాలతొ సత్కరించి ఎమ్మెల్సీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు



## జిల్లాలో మొదటి రోజు టెట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) మొదటి రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పూర్తిగా ప్రశాంతంగా ముగిశాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. అభ్యర్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ కీలక పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసిందని ఆయన తెలిపారు.జిల్లాలో టెట్ పరీక్షల నిర్వహణ కోసం మొత్తం రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కాలేజ్ నందు ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో రెండు సెషన్లకు కలిపి 200 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, మొదటి సెషన్‌కు 44 మంది, రెండవ సెషన్‌కు 38 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు.అలాగే అబ్దుల్ కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో రెండు సెషన్లకు కలిపి 200 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, మొదటి సెషన్‌కు 60 మంది, రెండవ సెషన్‌కు 74 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారని జిల్లా కలెక్టర్ వివరించారు.ఈ విధంగా మొదటి రోజు టెట్ పరీక్షలకు జిల్లాలో మొత్తం 400 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, అందులో 216 మంది అభ్యర్థులు మాత్రమే పరీక్షలకు హాజరై, 184 మంది అభ్యర్థులు గైహాజరు అయినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టినట్లు తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. అలాగే పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 163 బి.ఎన్.ఎస్.ఎస్ సెక్షన్ అమలు చేస్తూ ప్రశాంత వాతావరణాన్ని కల్పించినట్లు ఆయన తెలిపారు. టెట్ పరీక్షల నిర్వహణలో పాల్గొన్న విద్యాశాఖ అధికారులు, కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, పర్యవేక్షకులు, సిబ్బంది, పోలీసు శాఖ అధికారుల సమన్వయంతో పరీక్షలు సజావుగా నిర్వహించగలిగామని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. మిగిలిన పరీక్షలు కూడా ఇదే విధంగా ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ని కలిసిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు యువజన విభాగం అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పూల బోకె ఇచ్చిన అనంతరం కేటీఆర్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 'రిపబ్లిక్ డే' వేడుకల్లో తొలిసారి ఒగ్గుడోలు

తెలంగాణకు చెందిన ప్రత్యేక కళానైపుణ్యం ఒగ్గుడోలుకు అరుదైన గౌరవం దక్కబోతోంది. దేశ రాజధాని నగరం ఢిల్లీలో ఒగ్గుడోలు మోత మోగించనుంది. ఢిల్లీలో ఈనెల 26న జరిగే 'రిపబ్లిక్ డే' వేడుకల్లో రాష్ట్ర ఒగ్గు కళాకారులు ఒగ్గుడోలు ప్రదర్శన ఇవ్వనున్నారు. తెలంగాణ సాంస్కృతిక జీవనంలో భాగమైన ఒగ్గుడోలుకు గణతంత్ర వేడుకల్లో చోటు దక్కడం ఇదే తొలిసారి. కాగా ఈ ప్రదర్శన కోసం సిద్ధిపేట, జనగామ, జగిత్యాల, వికారాబాద్, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల నుంచి 30 మంది కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. వీరంతా ఈనెల 7న ఢిల్లీ వెళ్లి, 8 నుంచి రిహార్సల్స్ చేయనున్నారు. కాగా గణతంత్ర వేడుకల్లో తమ నైపుణ్యానికి చోటు దక్కడం పట్ల ఒగ్గు కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఒక్క మాట అన్నందుకే.. సభను బాయ్‌కాట్ చేస్తారా?: హరీశ్‌పై కవిత ఫైర్

సూర్యాపేట: అసెంబ్లీలో ప్రతిపక్షం లేకుండా కృష్ణానీటిపై ప్రభుత్వం అబద్ధాలు చెప్పిందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. సూర్యాపేటలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

**అది ఎవరి నిర్ణయం..?**

''వ్యక్తిగతంగా హరీశ్ రావును ఒక్క మాట అన్నందుకు అసెంబ్లీని బాయ్‌కాట్ చేస్తారా? ఆ అంశంపై వాకౌట్ చేస్తే తరువాత సభకు రావచ్చు కదా.. మిగతా బిల్లులపై చర్చ జరుగుతుంటే ప్రతిపక్షం ఉండొద్దా..? సభ నుంచి వాకౌట్ చేయాలనే నిర్ణయం హరీశ రావుదేనా? బీఆర్ఎస్ పార్టీలో హరీశ్ ఓ గుంపును తయారు చేస్తున్నారు. బాయ్‌కాట్ నిర్ణయం అధిష్ఠానానిదే అయితే.. అది మంచిది కాదు. బయట సభలు పెడుతూ.. చట్టసభల్లో మాట్లాడే అవకాశం వదులుకోవడం కరెక్ట్ కాదు. కృష్ణా పంపకాల్లో



హక్కులు తగ్గించి హరీశ్ సంతకం ఎందుకు పెట్టారో చెప్పి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేయాల్సింది. హరీశ్ ధనదాహం కోసమే జూరాల నుంచి శ్రీశైలానికి మార్పు చేశారు. హరీశ్ నిర్ణయాలతో సాగు నీటి ప్రాజెక్టులకు తీవ్రం నష్టం జరిగింది'' అని కవిత విమర్శించారు. ''కేసీఆర్ తప్పులు చేశారనే వాదన తప్ప కృష్ణానది నీటి వాటాపై చర్చ లేదు. ఆల్మట్టి ఎత్తు పెంచుకుంటే ఉత్తరం రాసి వదిలేశారు. కృష్ణాపై చిత్తశుద్ధి ఉంటే ఎందుకు సమగ్ర చర్చ జరపడం లేదు. తుంగభద్ర, కృష్ణా నీటిపై కర్ణాటకతో పేచీ ఉంటే.. రెండు కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎందుకు పరిష్కరించడం లేదు? గత ప్రభుత్వంపై నిందలు వేస్తూ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి సీఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారు. చిత్తశుద్ధి ఉంటే కర్ణాటక అప్పర్ భద్ర ప్రాజెక్టు జాతీయ హోదాను తొలగించాలని, ఆల్మట్టి ఎత్తు తగ్గించాలని తీర్మానం చేయాలి'' అని కవిత వ్యాఖ్యానించారు.

## ఆడుకుంటూ స్విమ్మింగ్‌పూల్‌లో పడి బాలుడి మృతి

హైదరాబాద్ (కేపీహెచ్‌బీ): ప్రమాదవశాత్తూ స్విమ్మింగ్ పూల్‌లో పడి అర్జున్ కుమార్ (3) మృతి చెందిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెర్టెక్స్ ప్రైమ్ గేటెడ్ కమ్యూనిటీలో జరిగింది. బాలుడి తల్లిదండ్రులు చింతల్‌లో నివసిస్తుండగా, సెలవుల నిమిత్తం బాలుడిని హైదర్‌నగర్‌లోని అమ్మమ్మ ఇంట్లో వదిలి వెళ్లారు. అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో ఆడుకుంటున్న అర్జున్ ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడిపోయాడు. ఎవరూ గమనించకపోవడంతో కొంతసేపటి తర్వాత బాలుడు నీటిపై తేలుతూ కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులు



బాలుడిని నిజాంపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వారాంతం సమయమైనా పూల్ వద్ద కేర్ టేకర్స్ లేకపోవడంతో పాటు సీసీ కెమెరాల పర్యవేక్షకుడు అందుబాటులో లేకపోవడం ప్రమాదానికి కారణమైందని బాలుడి తండ్రి వాపోయారు. అర్జున్ ఇక లేడు.. అందనంత దూరం వెళ్లిపోయాడని బాలుడి తండ్రి తన మిత్రుల వద్ద విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

## మేడారం.. భారీగా తరలివచ్చిన భక్త జనం

తాడ్వాయి: ములుగు జిల్లాలోని మేడారం మహా జాతర సమీపించేకొద్ది వనదేవతలు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజును దర్శించుకొనేందుకు వచ్చే భక్తుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఆదివారం సెలవు దినం కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా వేలాదిగా తరలిరావడంతో మినీ జాతరను తలపించింది. కుటుంబ సభ్యుల సమేతంగా వచ్చినవారు ముందుగా జంపన్న వాగులో స్నానాలు చేసి, అక్కడే జంపన్న, నాగులమ్మకు ముడుపులు కట్టారు. అనంతరం గద్దెల వద్దకు చేరుకొని దేవతలను దర్శించుకొని బంగారం (బెల్లం), పసుపు, కుంకుమ, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు జంపన్నవాగు, గద్దెల ప్రాంగణంలో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. జాతర ప్రధాన



రహదారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, ఎంపీ బలరాంనాయక్, అధికారులు కూడా దేవతల దర్శనం, పనుల పర్యవేక్షణకు రావడంతో కాన్వాయ్‌లతో కొంత ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి.

## అలా అయితే.. కాంగ్రెస్‌ను ఎన్నిసార్లు ఉరి తీయాలి

హైదరాబాద్: కేసీఆర్, హరీశ్ రావును ఉరి తీయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటున్నారు.. అలా అయితే కాంగ్రెస్ పార్టీని ఎన్ని సార్లు, ఎన్ని రకాలుగా ఉరి తీయాల్సి వస్తుందోనని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (KTR) అన్నారు. హామీ ఇచ్చి.. మాట తప్పినందుకు రాహుల్ గాంధీని అశోక్ నగర్, వరంగల్‌లో ఉరి తీయాలని.. హామీలు ఎగ్గొట్టినందుకు కాంగ్రెస్ నాయకత్వాన్ని 420 సార్లు ఉరి తీయాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. నదీజలాలపై కాంగ్రెస్ ద్రోహాల పరంపర కొనసాగుతోందని, అసెంబ్లీలో సభా నాయకుడి వ్యవహారం చూస్తే వినాశకాలే విపరీత బుద్ధి అనే సామెత గుర్తుకు వస్తోందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ సాధించి, ఆకలి బాధలు మాయం చేసి, రాష్ట్రాన్ని అన్నపూర్ణగా నిలిపిన మహా నాయకుడు కేసీఆర్‌ను ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బేసిన్లు తెలియని అసమర్థ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని విమర్శించారు. చెక్ డ్యామ్‌లను పేల్చే చెత్త ప్రభుత్వాన్ని దేశంలో ఎక్కడా చూడలేదన్నారు. అందరి హక్కులు కాపాడాల్సిన సభాపతి... సీఎం పరుష పదాలు మాట్లాడినా చూస్తూ కూర్చోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి తెలంగాణ కోసం ప్రాణాలు ఇస్తానని చెబుతున్నారు.. ఉద్యమకారులపై తుపాకీ



తీసుకెళ్లిన వైనాన్ని ఎవరూ మరిచిపోలేరని అన్నారు.

## తెలంగాణకు.. నంబర్1 విలన్ కాంగ్రెస్: హరీశ్‌రావు



హైదరాబాద్: 'నదీ జలాలు కాంగ్రెస్ ద్రోహులు' పేరిట భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణకు నంబర్ 1 విలన్ కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. ''తెలంగాణను గతంలో ఏపీలో కలిపి కాంగ్రెస్ పార్టీ మరణ శాసనం రాసింది. ఆ పార్టీ తెచ్చిన ఆయకట్టు కన్నా ఏడున్నర రెట్లు బీఆర్ఎస్ సాధించింది. తాత్కాలిక సర్దుబాటు కిందే నీటి వాటాలకు కేసీఆర్ ఒప్పుకొన్నారు. శాసన సభను సీఎం రేవంత్‌రెడ్డి తప్పుదోవ పట్టించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు 34,720 క్యూసెక్కులు పోతున్నాయని మంత్రి ఉత్తమ్ అన్నారు. పాలమూరు రంగారెడ్డికి 4 అనుమతులే వచ్చాయని అసెంబ్లీలో చెప్పారు. పాలమూరు ప్రాజెక్టుకు 2 టీఎంసీల నుంచి ఒక టీఎంసీకి తగ్గించిందని అబద్ధం చెప్పారు. పాలమూరుకు కాంగ్రెస్, తెదేపా చేసిన ద్రోహాలను రేవంత్‌రెడ్డి కొనసాగిస్తున్నారు. ఏపీలో కలవకముందు తెలంగాణలో 16.03 లక్షల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం తెలంగాణలో 48.74 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది'' అని హరీశ్ రావు అన్నారు.

## మహిళల భద్రతపై 'వన్ మినిట్' ఫిల్మ్ ఫెస్టివల్.. టీజీ ఉమెన్ సేఫ్టీ వింగ్ వినూత్న ప్రయత్నం

మహిళల భద్రత, బాలల రక్షణపై సమాజంలో మార్పు తెచ్చేందుకు తెలంగాణ మహిళా భద్రత విభాగం, యూనిసెఫ్, అన్నపూర్ణ ఫిల్మ్ కాలేజీతో కలిసి 'వన్ మినిట్ ఫిల్మ్ ఫెస్టివల్' నిర్వహిస్తోంది. మహిళలపై వేధింపులు, వివక్షకు వ్యతిరేకంగా యువత తమ సృజనాత్మకతతో గళమెత్తాలని కోరుతున్నట్లు ఉమెన్ సేఫ్టీ వింగ్ ఏడీజీపీ చారు సిన్హా ఆదివారం ప్రకటన ద్వారా తెలిపారు.




వన్ మినిట్' ఫిల్మ్ ఫెస్టివల్‌లో 18 నుంచి 35 ఏళ్ల లోపు యువత, విద్యార్థులు పాల్గొనవచ్చని కేవలం ఒక నిమిషం నిడివి గల లఘు చిత్రాలను రూపొందించాలని తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ ఏ భాషలోనైనా రూపొందించవచ్చని, చిత్ర నిర్మాణంలో ఏఐ (కృత్రిమ మేధ) వాడకూడదని పేర్కొన్నారు. ఎంపిక చేసిన చిత్రాలకు మార్చి 9న అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. విచారణకు హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రావు

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ నవీన్‌రావుకు సిట్ నోటీసులు ఇచ్చింది. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్ పీఎస్‌లో నవీన్‌రావు సిట్ విచారణకు హాజరయ్యారు.



## మంత్రి సీతక్కకు అధిష్టానం కీలక బాధ్యతలు

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిరక్షణ లక్ష్యంగా దేశవ్యాప్తంగా ఏఐసీసీ ఎంజీఎన్ఆర్ఈజీఏ బచావో సంగ్రామ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏఐసీసీ నిర్ణయం తీసుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా అఖిల భారత స్థాయిలో విస్తృత నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆ పార్టీ ప్రకటించింది. ఈ కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ,



సమన్వయం కోసం ఏఐసీసీ ప్రత్యేక సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రకటనను పార్టీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం విడుదల చేశారు. గ్రామీణ పేదలు, కూలీల హక్కుల పరిరక్షణకు జరుగుతున్న ఈ జాతీయ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్కకు కీలక బాధ్యతలు అప్పగించారు. అజయ్ మాకెన్ కన్వీనర్‌గా ఉన్న ఈ కమిటీలో జైరాం రమేష్, సందీప్ దీక్షిత్, ఉదిత్ రాజ్, ప్రియాంక్ ఖర్గే, మంత్రి సీతక్క, దీపికా పాండే సింగ్, సునీల్ పవార్, మనీష్ శర్మ సభ్యులుగా ఉన్నారు. ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, గ్రామీణ భారతంలోని కోట్లాది కూలీల ఉపాధి హక్కులను కాపాడే లక్ష్యంతో ఈ బచావో సంగ్రామ్ దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమంగా సాగనుందని ఏఐసీసీ స్పష్టం చేసింది.

## భార్య తొమ్మిది నెలల గర్భిణి.. బిడ్డలను పోషించలేక తండ్రి ఆత్మహత్య

* **కామారెడ్డి జిల్లాలో ఘటన**

బీర్కూర్: బిడ్డలను పోషించలేక తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బీర్కూర్ మండలం వీరాపూర్‌దుబ్బాకు చెందిన ప్రహ్లాద్ (30) అనే వ్యక్తికి అదే గ్రామానికి చెందిన సౌందర్యతో పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు స్నేహ (8), హర్షిత (6), వసుంధర (4) ఉన్నారు. ప్రహ్లాద్ రోజూవారీ కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. తనకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారని, వారిని ఏ విధంగా చదివించి, వివాహాలు చేయాలని బాధపడేవారు. ప్రస్తుతం సౌందర్య 9 నెలల గర్భిణి. ఈ నెల 26లోపు కాన్పు అవుతుందని వైద్యులు తెలిపారు. నాలుగో సంతానం కూడా కుమార్తె జన్మించొచ్చనే



భయంతో శనివారం మధ్యాహ్నం ఇంట్లో కుటుంబ సభ్యులు చూస్తుండగానే విష ద్రావకం తాగారు. కుటుంబీకులు వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం బాన్సువాడ ప్రాంతీయ దవాఖానాకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందారు. ఆదివారం మృతదేహానికి శవ పరీక్ష చేసి కుటుంబీకులకు అప్పగించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

## డిండి ప్రాజెక్టుకు నీళ్లు తరలించే ప్రతిపాదన సరికాదు.. ఎంపీ డీకే అరుణ

మాజీ సీఎం కేసీఆర్‌పై బీజేపీ నేత, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు రూపు రేఖలు మార్చేశారని అన్నారు. ఆదివారం ఆమె జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక పాలమూరు ప్రాజెక్టు పూర్తి చేసి రైతుల పాదాలు కడుగుతా అన్నారు.. పదేళ్లు అధికారంలో ఉండి ఏమి చేయలేకపోయారని డీకే అరుణ అన్నారు. నెట్టెంపాడు, కల్వకుర్తి, బీమా, కోయిల్ సాగర్, ఆర్డీఎస్ వంటి ప్రాజెక్టులను వారి రాజకీయ అవసరాల కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ప్రాజెక్టులపై దృష్టి సారించలేదన్నారు. కేవలం డైలాగులతోనే పాలమూరు జిల్లా ప్రజలను తృప్తి పరిచే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. జూరాల అప్రోచ్ ఉన్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును తీసి.. నార్లాపూర్ శ్రీశైలం బ్యాక్ వాటర్ దగ్గర అప్రోచ్‌ను మార్చారని వెల్లడించారు. నాడే తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలిపారు. దీని వల్ల ప్రాజెక్టు పూర్తి కాదు.. కేవలం రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆ నాడే మాట్లాడినట్లు తెలిపారు. డిండి ప్రాజెక్టుకు నీళ్లు తరలించే ప్రతిపాదన సరికాదని, మళ్లీ పొరపాటు చేయవద్దని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.



# 20 ఏళ్ల తర్వాత శివసేన భవన్‌లోకి.. రాజ్ ఠాక్రే భావోద్వేగం



సుదీర్ఘకాలం దూరంగా ఉన్న శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రేలు ఇటీవల చేతులు కలిపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో దాదాపు 20ఏళ్ల తర్వాత శివసేన భవన్‌లో రాజ్ ఠాక్రే అడుగుపెట్టారు. ఒకప్పుడు సొంతిల్లులా భావించిన పార్టీ కార్యాలయంలోకి తిరిగి రావడం ఎంతో భావోద్వేగంగా ఉందన్నారు. ''ఇక్కడకు రావడం ఎలా అనిపించింది అని ప్రతి ఒక్కరూ అడుగుతున్నారు. 20 ఏళ్ల తర్వాత నాకు జైలు నుంచి బయటకు వచ్చినట్లు అనిపిస్తోంది. శివసేనా భవన్‌తో ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయి. వాటిని చెప్పడానికి రోజులు పడుతుంది'' అని రాజ్ ఠాక్రే పేర్కొన్నారు. 1977లో భవన నిర్మాణం జరుగుతున్న వేళ జనతా పార్టీ ఊరేగింపు జరుగుతోందని, ఆ సమయంలో భవనంపై కొందరు రాళ్లు రువ్వారని అన్నారు. ట్యూబ్‌లైట్లు విసిరి శివసైనికులు వారికి దీటుగా బదులిచ్చారని గుర్తు చేసుకున్నారు.

**ఆ ఫలితాలు రద్దు చేయండి - ఉద్ధవ్**

స్థానిక ఎన్నికల్లో భాగంగా.. 68 వార్డుల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన 'మహాయుతి' అభ్యర్థుల ఫలితాలను రద్దు చేయాలని ఉద్ధవ్ ఠాక్రే రాష్ట్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. పోటీ చేయకుండానే విజయాలు సాధించడం అనేది జెన్ జడ్‌తోపాటు తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకునేవారు తమ హక్కును కోల్పోతారని అన్నారు. అధికారంలో ఉన్న మహాయుతి కూటమిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డ ఆయన.. ఏక్‌నాథ్ శిందే ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి బీఎంసీ సంపదను కాంట్రాక్టర్లకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు.

## వెనెజువెలాలో పరిస్థితులు
# నిశితంగా పరిశీలిస్తున్నాం



**: విదేశాంగ శాఖ**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలతో వెనెజువెలాపై యూఎస్ మిలిటరీ చేపట్టిన సైనిక చర్యపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. వెనెజువెలాలోని ప్రస్తుత పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ఆ దేశంలోని భారతీయులతో వెనెజువెలాలోని భారత రాయబార కార్యాలయం సంప్రదింపులు జరుపుతోందని.. వారికి కావాల్సిన సహాయం అందిస్తోందని పేర్కొంది. భారత పౌరులు కారకాస్‌లోని రాయబార కార్యాలయంతో నిరంతరం కాంటాక్ట్‌లో ఉండాలని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ సూచించారు. వెనెజువెలా ప్రజల శ్రేయస్సు, భద్రత విషయంలో భారత్ మద్దతు కొనసాగుతోందని హామీ ఇచ్చారు.

## ప్రియాంక గాంధీకి కీలక బాధ్యతలు..
# అస్సాం స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌గా నియామకం



కాంగ్రెస్ అగ్రనాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీకి ఆ పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది. ఈ ఏడాది అస్సాంలో ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అక్కడ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌గా ఆమెను నియమించింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రియాంక కమిటీలో లోక్‌సభ ఎంపీలు ఇమ్రాన్ మసూద్, సప్తగిరి శంకర్ ఉలకతో పాటు సిరివెల్ల ప్రసాద్‌ను సభ్యులుగా నియమించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖరారు, ఎన్నికల ముందు జరగాల్సిన అంతర్గత సంప్రదింపులు వంటివి ఈ కమిటీ నిర్వహించనుంది. ఇక, పశ్చిమ బెంగాల్, కేరళ. తమిళనాడు పుదుచ్చేరిలకు కూడా స్క్రీనింగ్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

# నకిలీ యూపీఎస్సీ ఫలితాలతో ఐఏఎస్ సెంటర్‌కు.. మోసపోయిన అభ్యర్థి!




ముస్సోరి: నకిలీ యూపీఎస్సీ ఫలితాలతో ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్(ఎల్‌బీఎస్ఎన్ఏఏ)కు ఓ వ్యక్తి రావడం కలకలం రేపింది. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. వివరాల్లోకి వెళ్తే.. బిహార్‌లోని సరన్ జిల్లాకు చెందిన పుష్పేశ్ సింగ్ గురుగ్రామ్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. అక్కడే పరిచయమైన కొందరు వ్యక్తులు యూపీఎస్సీ పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించారు. రెండు విడతలుగా దాదాపు రూ. 28వేలు వసూలు చేశారు. అనంతరం అతడికి వాట్సప్ ద్వారా యూపీఎస్సీకి ఎంపికైనట్లు నకిలీ ఫలితాలను పంపించారు. శిక్షణ కోసం ఎల్‌బీఎస్ఎన్ఏఏకు రావాలని సూచించారు. అదంతా నమ్మిన పుష్పేశ్ సింగ్ శిక్షణ కోసం తన తల్లిదండ్రులతో కలిసి శనివారం ట్రైనింగ్ సెంటర్‌కు వెళ్లాడు. అతడి ఫలితాలను పరిశీలించిన అధికారులు.. అవి నకిలీవని గుర్తించి పోలీసులు, అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వెంటనే అకాడమీకి చేరుకున్నారు. లోకల్ ఇంటెలిజెన్స్ యూనిట్, ఇంటెలిజెన్స్ బ్యూరో బృందాలను రంగంలోకి దింపారు. ప్రాథమిక విచారణ అనంతరం తాను మోసపోయినట్లు పుష్పేశ్ గ్రహించాడు. అతని ఫిర్యాదు మేరకు అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, కేసును గురుగ్రామ్‌కు బదిలీ చేశారు.

## గ్రామంపై దుండగుల దాడి..
# 30 మందికి పైగా మృతి



ఉత్తర నైజీరియా ప్రాంతంలోని నైజర్ రాష్ట్రంలో దుండగులు దారుణానికి పాల్పడ్డారు. శనివారం సాయంత్రం బోర్గు ప్రభుత్వ పరిధిలోని కసువాన్ డాజీ గ్రామంలోకి ఆయుధాలతో చొరబడి.. విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 30 మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరిని దుండగులు అపహరించుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. దుండగుల కాల్పుల్లో 37 మంది మృతి చెందినట్లు ప్రాథమిక అంచనా ఉందన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని వెల్లడించారు. దుండగులు గ్రామంలోని స్థానిక మార్కెట్‌తోపాటు పలు ఇళ్లను తగలబెట్టినట్లు పోలీసులు తెలిపారు. అపహరణకు గురైన వారి ఆచూకీ కోసం బలగాలను రంగంలోకి దింపినట్లు చెప్పారు. ఈ ఘటనతో అక్కడి ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

# బ్రూక్లిన్ జైల్లో మదురో.. అదో 'నరకం'!



ఆపరేషన్ 'ఆబ్జల్యూట్ రిజాల్వ్' చేపట్టిన అమెరికా.. వెనెజువెలా అధ్యక్షుడు మదురో, ఆయన సతీమణిని బంధించి న్యూయార్క్‌కు తరలించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వారిని బ్రూక్లిన్‌లోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్‌లో ఉంచారు. ఆర్.కెల్లీ, సీన్ డిడ్డీ కాంబ్స్ వంటి మ్యూజిక్ స్టార్‌లు ఉన్న ఈ జైలు ఎంతో సమస్యాత్మకమైందిగా భావిస్తుంటారు. నిందితులను అక్కడికి పంపించేందుకు కొందరు న్యాయమూర్తులే నిరాకరిస్తారనే ప్రచారం వ్యాప్తిలో ఉంది. బ్రూక్లిన్‌లోని ఎండీసీని 1990లో ప్రారంభించారు. ప్రస్తుతం అక్కడ 1300 మంది ఖైదీలు ఉన్నారు. వివిధ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటూ మన్‌హటన్, బ్రూక్లిన్ ఫెడరల్ న్యాయస్థానాల్లో విచారణ కోసం వేచిచూస్తున్న వారిని ఇక్కడికి పంపిస్తుంటారు. వైట్‌కాలర్ నేరాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారితోపాటు గ్యాంగ్‌స్టర్‌లు, మాదకద్రవ్యాల కేసులో నిందితులను ఉంచుతారు. వెనెజువెలా అధ్యక్షుడు మదురో ప్రస్తుతం ఇక్కడే ఉన్నారు. ఓ దేశ అధ్యక్షుడు ఇక్కడ నిర్బంధానికి గురికావడం ఇదే తొలిసారి కాదు. హోండురస్ మాజీ అధ్యక్షుడు జువాన్ ఆర్లాండో హెర్నాండెజ్ గతంలో ఇక్కడ బందీగా ఉన్నారు. వందలాది టన్నుల కొకైన్‌ను అమెరికాలోకి అక్రమ రవాణా చేశారన్న కేసులో ఆయనకు 45ఏళ్ల శిక్ష పడింది. అయితే, గతేడాది ట్రంప్ ఆయనకు క్షమాభిక్ష ప్రసాదించడంతో జైలు నుంచి విడుదలయ్యారు. మెక్సికోకు చెందిన మాదకద్రవ్యాల వ్యాపారులు, వెనెజువెలా నిఘా విభాగం మాజీ చీఫ్ హ్యూగో కార్వాజల్‌తోపాటు ఆ దేశానికి చెందిన పలువురు కీలక వ్యక్తులు ఇక్కడ బందీలుగా ఉన్నారు.

**భూమిపై నరకంగా..**

స్టాచ్యూ ఆఫ్ లిబర్టీకి కనుచూపు మేరలో ఉన్న ఈ జైలుపై అనేక విమర్శలు ఉన్నాయి. ఇక్కడి దారుణ పరిస్థితుల కారణంగా దీన్ని భూమిపై నరకం, నిరంతర విషాదంగా అభివర్ణిస్తారు. ఇక్కడ హింసాత్మక ఘటనలపై ఖైదీలు, వారి న్యాయవాదుల నుంచి ఎన్నో ఫిర్యాదులు వస్తుంటాయి. 2024లో సహచరుల చేతిలో ఇద్దరు ఖైదీలు హత్యకు గురయ్యారు.

# బెంగళూరులో 'చిత్ర సంతే'.. నడిరోడ్డే ఆర్ట్ గ్యాలరీ!





బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులో ఓపెన్ ఆర్ట్ గ్యాలరీ ఎగ్జిబిషన్ ఆదివారం ప్రారంభమైంది. కర్ణాటక చిత్రకళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 23వ 'చిత్ర సంతే' ఎగ్జిబిషన్‌ను సీఎం సిద్ధరామయ్య ప్రారంభించారు. శివానంద సర్కిల్ నుంచి విండ్సర్ మానర్ హోటల్ వరకు ఉన్న కుమారకృప రోడ్డు.. ఓపెన్ ఆర్ట్ గ్యాలరీగా మారిపోయింది. ఈ ఏడాది 'చిత్ర సంతే'లో పర్యావరణ పరిరక్షణ థీమ్‌ను ఎంచుకున్నారు. దేశంలోని 22 రాష్ట్రాలు, 4 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 1,530 మంది చిత్రకారులు ఈ ఆర్ట్ గ్యాలరీలో పాల్గొన్నారు. మైసూరు, తంజావూరు, రాజస్థానీ, మధుబని వంటి సంప్రదాయ చిత్రకళలతోపాటు ఆధునిక చిత్రాలు, కార్టూన్లు.. ఇలా చిత్రకారులు వేసిన ఎన్నో పెయింటింగ్స్ ఈ ఎగ్జిబిషన్‌లో ఉన్నాయి. వీటి ధరలు రూ. 100 నుంచి రూ.లక్షల్లో ఉంటాయని ఆర్ట్ గ్యాలరీ నిర్వాహకులు తెలిపారు. సుమారు 5 లక్షల మంది ఈ ఆర్ట్ గ్యాలరీని సందర్శించే అవకాశముందన్నారు. ప్రజల సౌకర్యార్థం మెట్రో ఫీడర్ బస్సులు, మొబైల్ ఏటీఎంలను కూడా ఏర్పాటు చేశారు. చిత్ర సంతేను ప్రారంభించడం తనకు ఎంతో సంతోషంగా ఉందని సీఎం సిద్ధరామయ్య అన్నారు. 2003లో ప్రారంభమైన ఈ ఎగ్జిబిషన్ విజయవంతంగా కొనసాగుతోందన్నారు. దీనిని తాను ఎనిమిదో సారి ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఆర్ట్ అనేది రాష్ట్ర సంస్కృతిని తెలియజేస్తుందని రాజా రవి వర్మ అన్న మాటను ఆయన గుర్తు చేశారు. ప్రకృతి మనల్ని కాపాడేలోపే మనం ప్రకృతిని కాపాడాలని సీఎం చెప్పారు.

# ఒలింపిక్స్2036 నిర్వహణకు భారత్ సన్నద్ధమవుతోంది

**: ప్రధాని మోదీ**



వారణాసి: ఒలింపిక్స్ 2036 క్రీడలను నిర్వహించేందుకు భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. గత పదేళ్లలో అంతర్జాతీయ క్రీడలకు భారత్ వేదికగా నిలిచిందన్నారు. వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవంలో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. గత దశాబ్ద కాలంలో భారత్‌లో 20కిపైగా అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించామని గుర్తుచేశారు. అండర్ 17 ఫిఫా వరల్డ్‌కప్, హాకీ వరల్డ్ కప్, చెస్ టోర్నమెంట్ వంటి అంతర్జాతీయ ఈవెంట్లకు భారత్ విజయవంతంగా ఆతిథ్యం ఇచ్చిందన్నారు. 2030లో జరిగే కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్‌లోనే జరగనున్నాయని తెలిపారు. 2036లో ఒలింపిక్ క్రీడల కోసం భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని చెప్పారు. భారత్ అభివృద్ధి వృత్తాంతాన్ని ప్రధాని మోదీ వాలీబాల్ ఆటతో పోల్చారు. ఏ విజయమైనా ఒక్కరి వల్ల సాధ్యం కాదనే విషయాన్ని ఈ క్రీడ తెలియజేస్తుందని, మన సమన్వయం, విశ్వాసం, జట్ల సంసిద్ధతపైనే మన విజయం ఆధారపడి ఉంటుందన్నారు. ఇందులో ప్రతి ఒక్కరి పాత్ర, బాధ్యత ఉంటుందని, వాటిని నెరవేర్చినప్పుడే మనం విజయం సాధిస్తామన్నారు. జనవరి 4 నుంచి 11 వరకు జరగనున్న ఈ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో దేశవ్యాప్తంగా 58 జట్లకు చెందిన వెయ్యికిపైగా క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ పోటీలతో వారణాసి నగరం జాతీయ స్థాయి క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా మారుతుందని వాలీబాల్ ఛాంపియన్‌షిప్ నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# కరెంటు లేదు.. ఆహారం, ఫోన్ల ఛార్జింగ్ కోసం బారులు: వెనెజువెలాలో పరిస్థితి ఇదీ!



ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా.. వెనెజువెలాపై అమెరికా ఒక్కసారిగా మెరుపుదాడులకు పాల్పడింది. ఈ దాడులతో ఆ దేశ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. వైమానిక దాడుల్లో కీలకమైన మౌలిక సదుపాయాలు, విద్యుత్ గ్రిడ్‌లు దెబ్బతినడంతో కారకాస్‌లోని అనేక ప్రాంతాల్లో కరెంట్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సూపర్ మార్కెట్లు మూతపడటంతో.. చిన్న దుకాణాల వద్ద ప్రజలు ఆహారం కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి తలెత్తింది. కారకాస్‌లోని భారతీయుడు సునీల్ మల్హోత్రా మీడియాతో మాట్లాడుతూ అక్కడి పరిస్థితులను వివరించారు. 'భారీ నష్టం జరిగింది. కారకాస్‌లోని విమానాశ్రయంపై కూడా అమెరికా దాడి చేసింది. నగరానికి 100 కి.మీల దూరంలో ఓ వైమానిక స్థావరం ఉంది. దేశంలోనే అతిపెద్దది. అది కూడా దెబ్బతింది. ఫోర్ట్‌ట్యూనా మిలిటరీ స్థావరం వద్ద ఎక్కువ నష్టం జరిగింది. దాడి అనంతరం అన్ని సూపర్ మార్కెట్లు మూసేశారు. చిన్న దుకాణాలు మాత్రమే తెరిచి ఉన్నాయి. వాటి ముందు పొడవైన క్యూలు కన్పిస్తున్నాయి. ప్రతి చోటా 500 600 మంది బారులు తీరారు. ఫార్మసీల వద్ద చాలా పెద్ద క్యూలు కన్పిస్తున్నాయి' అని పేర్కొన్నారు.

## 2025లో 22,830 కోట్ల యూపీఐ లావాదేవీలు




**న్యూఢిల్లీ:** భారతదేశంలో నగదు రహిత ఆర్థిక వ్యవస్థ వైపు అడుగులు వేగంగా పడుతున్నాయి. 2025 ఏడాదిని 'యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్' సరికొత్త రికార్డులతో ముగించింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, గతేడాది యూపీఐ లావాదేవీలు విలువ , సంఖ్య పరంగా ఆల్-టైమ్ హై రికార్డును నమోదు చేశాయి. 2025 ఏడాది మైలురాళ్లు:2025 మొత్తం క్యాలెండర్ ఇయర్ పరిశీలిస్తే, యూపీఐ వ్యవస్థ ద్వారా జరిగిన అభివృద్ధి విస్మయానికి గురిచేస్తోంది. మొత్తం లావాదేవీల సంఖ్య: 2025లో ఏకంగా 228 బిలియన్ల (22,800 కోట్లు) కంటే ఎక్కువ లావాదేవీలు జరిగాయి. ఇది 2024లో జరిగిన 172.2 బిలియన్ల లావాదేవీలతో పోలిస్తే సుమారు 33 శాతం వృద్ధి. మొత్తం లావాదేవీల విలువ: గత ఏడాదిలో లావాదేవీల విలువ దాదాపు రూ. 300 లక్షల కోట్ల మైలురాయిని తాకింది. ఇది 2024తో పోలిస్తే 21 శాతం పెరుగుదల. డిసెంబర్ రికార్డ్:కేవలం డిసెంబర్ 2025 నెలలోనే 21.6 బిలియన్ల లావాదేవీలు జరిగాయి, వీటి విలువ సుమారు రూ. 28 లక్షల కోట్లు.

### చిన్న లావాదేవీల విప్లవం:

గణాంకాల ప్రకారం, సగటు లావాదేవీ విలువ తగ్గడం విశేషం. 2024లో రూ. 1,478గా ఉన్న సగటు విలువ, 2025 నాటికి రూ. 1,293కి పడిపోయింది. దీని అర్థం ప్రజలు కేవలం పెద్ద మొత్తాలకే కాకుండా, టీ కొట్లు, కిరాణా దుకాణాలు, కూరగాయల మార్కెట్ల వద్ద అతి తక్కువ మొత్తాల చెల్లింపులకు కూడా యూపీఐని విరివిగా ఉపయోగిస్తున్నారు.

### ప్రపంచంలోనే నంబర్ వన్:

అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఎఓఈ) నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న మొత్తం రియల్ టైమ్ డిజిటల్ చెల్లింపుల్లో భారత్ వాటా 49 శాతానికి చేరింది. బ్రెజిల్, చైనా, థాయ్‌లాండ్ వంటి దేశాల కంటే భారత్ ఎంతో ముందంజలో ఉంది. ప్రస్తుతం దేశంలో సగటున రోజుకు 69.8 కోట్ల లావాదేవీలు యూపీఐ ద్వారా జరుగుతున్నాయి.

### పెరిగిన నెట్‌వర్క్:

దేశవ్యాప్తంగా క్యూఆర్ కోడ్‌ల సంఖ్య గత ఏడాదిలో 111 శాతం పెరిగి 678 మిలియన్లకు చేరుకుంది. టైర్-2, టైర్-3 పట్టణాలు , గ్రామాల్లో కూడా యూపీఐ వినియోగం విపరీతంగా పెరగడం డిజిటల్ ఇండియా విజయానికి నిదర్శనం. 'యూపీఐ ఆటోపే', 'యూపీఐ లైట్', , 'క్రెడిట్ ఆన్ యూపీఐ' వంటి కొత్త ఫీచర్లు ఈ వృద్ధిని మరింత వేగవంతం చేశాయి. మొత్తానికి, 2025లో భారతీయుల దైనందిన ఆర్థిక జీవనంలో యూపీఐ ఒక విడదీయలేని భాగంగా మారిపోయింది. రాబోయే 2026-27 నాటికి రోజుకు 100 కోట్ల లావాదేవీల లక్ష్యాన్ని చేరుకోవాలని ఎన్పీసీఐ భావిస్తోంది.

## వారంలోనే కాసుల వర్షం..

### 91% వరకు లాభాలను అందించిన 5 టాప్ స్టాక్స్..!



**ముంబై:** గత వారంలో భారత స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 0.84% పెరిగి 85,762 పాయింట్ల వద్ద, నిఫ్టీ 1.09% పెరిగి 26,328 పాయింట్ల వద్ద స్థిరపడ్డాయి. ఈ ర్యాలీలో కొన్ని చిన్న కంపెనీల షేర్లు పెట్టుబడిదారులకు భారీ రిటర్న్‌ను అందించాయి. ఆ 5 స్టాక్స్ వివరాలు ఇక్కడ ఉన్నాయి:

**1. హింద్ అల్యూమినియం ఇండస్ట్రీస్**

ఈ షేర్ గత వారంలో ఏకంగా 91.54% రిటర్న్‌ను అందించింది. వారం ప్రారంభంలో రూ. 69.88 వద్ద ఉన్న ఈ షేర్ ధర, శుక్రవారం నాటికి రూ. 133.85 కి చేరుకుంది. ఈ కంపెనీ మార్కెట్ క్యాప్ రూ. 84.33 కోట్లు.

**2. కెఎస్ఆర్ ఫుట్‌వేర్**

ఈ ఫుట్‌వేర్ కంపెనీ షేర్ గత ఐదు రోజుల్లో 66.96% మేర పెరిగింది. రూ. 14.56 నుంచి ఈ షేర్ ధర రూ. 24.31 కి చేరుకుంది. దీని మార్కెట్ విలువ ప్రస్తుతం రూ. 43.80 కోట్లుగా ఉంది.

**3. విజన్ సినిమాస్**

ఇది ఒక పెన్నీ స్టాక్. గత వారంలో ఈ షేర్ 48.76% లాభాలను ఇచ్చింది. రూ. 1.21 నుంచి ప్రారంభమై రూ. 1.80 వద్ద ముగిసింది. కేవలం సవా రూపాయి కంటే కొంచెం ఎక్కువ ధర కలిగిన ఈ స్టాక్ మార్కెట్ క్యాప్ రూ. 12.75 కోట్లు.

**4. వా సోలార్**

సోలార్ ఎనర్జీ రంగానికి చెందిన ఈ కంపెనీ షేర్ గత వారంలో 48.35% పెరిగింది. రూ. 46.35 నుంచి ఈ స్టాక్ ధర రూ. 68.81 కి చేరింది. దీని మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 91.29 కోట్లు.

**5. సావరీన్ డైమండ్స్**

ఈ డైమండ్ కంపెనీ షేర్ గత వారం 43.42% రిటర్న్ ఇచ్చి ఇన్వెస్టర్లను ఆకట్టుకుంది. రూ. 20.73 నుంచి ఈ షేర్ ధర రూ. 29.73 కి పెరిగింది. శుక్రవారం ఒక్కరోజే ఈ స్టాక్ 20% వరకు అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.

## బ్యాంకింగ్ రంగంలో ఏఐ ఎఫెక్ట్..

### 2030 నాటికి 2,00,000 జాబ్స్ గాల్లో దీపాలే..!




**న్యూఢిల్లీ:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అన్ని రంగాల్లో తన ప్రభావాన్ని చూపిస్తోంది. ఏఐతో గంటల్లో పూర్తయ్యే పనులు నిమిషాల్లోనే పూర్తవుతున్నాయి. ఇదే సమయంలో మరో భయం వెంటాడుతోంది. ఇప్పటికే పెరిగిన ఖర్చులను తగ్గించుకునేందుకు దిగ్గజ కంపెనీలు లేఆఫ్స్ పేరిట ఉన్నపళంగా ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఇప్పుడు ఏఐ కారణంగా ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఇది బ్యాంకింగ్ రంగంలో ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల 2030 నాటికి యూరోపియన్ బ్యాంకుల్లో 200,000 కంటే ఎక్కువ ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉంది. ఈ సమాచారాన్ని ఓ నివేదిక వెల్లడించింది. నివేదిక ప్రకారం, మోర్గాన్ స్టాన్లీ విశ్లేషణ ప్రకారం, 35 ప్రధాన యూరోపియన్ బ్యాంకులతో సహా రుణదాతలు రాబోయే ఐదు సంవత్సరాలలో వారి మొత్తం శ్రామిక శక్తిని 10 శాతం తగ్గించుకోవచ్చు, ఇది పెద్ద ఎత్తున తొలగింపులకు దారితీయవచ్చు అని వెల్లడించింది. కరోనా మహమ్మారి నుండి టెక్ పరిశ్రమలో ఇప్పటికే భారీ తొలగింపులు జరిగాయి.

## వరల్డ్‌కప్ ఆడుతాం.. కానీ, మా జట్టును

# భారత్‌కు పంపించం..!




**ఢాకా:** భారత్, బంగ్లాదేశ్ మధ్య దౌత్య సంబంధాలే కాదు క్రికెట్ సంబంధాలు కూడా దెబ్బతింటున్నాయి. హిందువుల హత్యలను నిరసిస్తూ ఐపీఎల్ నుంచి బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను బీసీసీఐ తప్పించడాన్ని ఆ దేశ బోర్డు సీరియస్‌గా తీసుకుంది. ఫిబ్రవరిలో జరుగబోయే ప్రపంచకప్ కోసం స్క్వాడ్‌ను ప్రకటించిన బంగ్లా క్రికెట్ బోర్డు కీలక ప్రకటన చేసింది. వరల్డ్‌కప్ ఆడేందుకు తమ జట్టును ఇండియాకు పంపమని ఐసీసీకి ఈ-మెయిల్ చేసింది. పొట్టి ప్రపంచకప్ సమీపిస్తున్న బంగ్లాదేశ్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఆదివారం సమావేశమైన బంగ్లా బోర్డు సభ్యులు ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్ నుంచి తప్పించడానికి ప్రతిచర్యగా కీలక ప్రకటన చేశారు. మెగా టోర్నీకి లిటన్ దాస్ సారథిగా 15 మందితో కూడిన స్క్వాడ్‌ను ఎంపిక చేసిన తర్వాత.. భద్రతా కారణాలతో భారత్‌కు తమ జట్టును పంపమని బోర్డు వెల్లడించింది.

'భద్రతా కారణాల రీత్యా మా జట్టును ప్రపంచకప్ కోసం భారత్‌కు పంపించడం సాధ్యం కాదు. బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నాం. బీసీసీఐ నిర్ణయానికి కౌంటర్‌గా మేము ఈ తీర్మానం చేశాం. మా జట్టు మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించండి' అని బంగ్లా క్రికెట్ బోర్డు ఆదివారం ఐసీసీకి పంపిన ఈ-మెయిల్‌లో తెలిపింది. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 7న ఈడెన్ గార్డెన్స్ మైదానంలో బంగ్లాదేశ్, వెస్టిండీస్ తలపడాలి. కానీ, ఇరుదేశాల బోర్డులు తమ ప్రభుత్వం మాటకే కట్టుబడి ఉన్నందున బంగ్లాదేశ్ మ్యాచ్‌లను శ్రీలంకలో నిర్వహిస్తారా? లేదా? రాజీకి వస్తారా? అనేది తెలియాల్సి ఉంది.

బంగ్లాదేశ్ టీ20 ప్రపంచకప్ స్క్వాడ్ : లిటన్ కుమార్ దాస్(కెప్టెన్), మొహమ్మద్ సైఫ్ హ్పాసేన్(వైస్ కెప్టెన్), తంజిద్ హసన్, పర్వేజ్ హ్పాసేన్, తౌహిద్ హృదయ్, షమీమ్ హ్పాసేన్, కాజీ నురుల్, మహేది హసన్, రిషద్ హ్పాసేన్, నసుమ్ అహ్మద్, ముస్తాఫిజుర్ రెహ్మాన్, తంజిమ్ హసన్, తస్కిన్ అహ్మద్, సైఫుద్దీన్, షొరిఫుల్ ఇస్లాం.

### బీసీసీఐ ఆదేశాల మేరకు

ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఖండిస్తున్న భారత ప్రభుత్వం.. ఆ దేశంతో దౌత్య సంబంధాలకు బ్రేక్ వేసింది. అంతేకాదు బీసీసీఐ ఆదేశాల మేరకు తమ స్క్వాడ్ నుంచి బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ తప్పించింది. దాంతో.. బంగ్లాదేశ్ బోర్డు సైతం వరల్డ్‌కప్ కోసం తమ జట్టును భారత్‌కు పంపించమని మెలిక పెట్టింది. మొదట.. తమ ఆటగాళ్లు, మీడియా, స్పాన్సర్లకు భద్రత కల్పిస్తామని బీసీసీఐ హామీ కానీ, తమ జట్టు మ్యాచ్‌లను శ్రీలంకలో నిర్వహించాలని ఐసీసీకి ఆ దేశ బోర్డు రాయడం చర్చనీయాంశమవుతోంది.

## బ్రూక్, రూట్ అర్ధ శతకాలు..

### తొలిరోజు ఇంగ్లండ్‌దే ఆధిపత్యం..!



**మెల్‌బోర్న్:** మెల్‌బోర్న్ టెస్టులో విజయంతో యాషెస్ సిరీస్‌లో బోణీ కొట్టిన ఇంగ్లండ్ (ఇనిఐశ్రీజీనిట) సిడ్నీలోనూ జోరు చూపించింది. సిరీస్‌లో మొట్టమొదటిసారి ఆ జట్టు బ్యాటర్లు క్రీజులో నిలబడి తొలి రోజే ఆలౌట్ గండాన్ని అధిగమించారు. ఓపెనర్లు విఫలమైనా.. హ్యారీ బ్రూక్(78 నాటౌట్), జో రూట్(72 నాటౌట్)లు ఆస్ట్రేలియా బౌలర్లను ధీటుగా ఎదర్కొంటూ అర్ధ శతకాలు బాదారు. ఫలితంగా.. తొలిరోజు ఆట ముగిసే సరికి ఇంగ్లండ్ 3 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది.

సిడ్నీ టెస్టులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ తొలి రోజు ఆధిపత్యం చెలాయించింది. వెలుతురు లేమి కారణంగా 45 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైనా పర్యాటక జట్టు మిడిలార్డర్ బ్యాటర్లు క్రీజునంటుకుపోయారు. ఓపెనర్లు బెన్ డకెట్(27), జాక్ క్రాలే(16)లు శుభారంభమిచ్చినా స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. కాసేపటికే బొలాండ్ ఓవర్లో జాకబ్ బెథెల్(10) ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన జో రూట్(72 నాటౌట్), హ్యారీ బ్రూక్(78 నాటౌట్)లు ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వలేదు. 57కే మూడు కీలక వికెట్లు పడిన వేళ వీరిద్దరూ ఏకొంచెం తడబడినా, ఒక చెత్త షాట్ ఆడినా ఇంగ్లండ్ ఆలౌటయ్యేది.

కానీ, వీరు చెక్కుచెదరని ఏకాగ్రతతో క్రీజులో పాతుకుపోయి స్కోర్‌బోర్డును నడిపించారు. ఆస్ట్రేలియా బౌలర్ల వ్యూహాలను చిత్తు చేస్తూ రూట్, బ్రూక్ అర్ధ శతకాలతో స్కోర్ 200 దాటించారు. నాలుగో వికెట్‌కు 150 పరుగులు రాబట్టడంతో ఆసీస్ బౌలర్లు నీరుగారిపోయారు. రెండో రోజు కూడా ఈ ద్వయం సెంచరీలు సాధిస్తే ఇంగ్లండ్ పటిష్ట స్థితిలో నిలిచినట్టే. వరుసగా..పెర్త్, బ్రిస్బేన్, అడిలైడ్‌లో ఓడిన ఇంగ్లండ్ సిరీస్‌ను కోల్పోయిన విషయం తెలిసిందే.

## ఇంగ్లండ్ కోచ్ రేసులో దిగ్గజ క్రికెటర్..

# అవకాశమిస్తే రఫ్ఫాడిస్తాడట..?



**లండన్:** సుదీర్ఘ ఫార్మాట్‌లో ఇంగ్లండ్ జట్టుకు కొత్త కోచ్‌ను చూసుకోవాల్సిన రోజులొచ్చేశాయి. అండర్సన్ -టెండూల్కర్ ట్రోఫీలో తడబాటు, యాషెస్ సిరీస్‌లో ఆ జట్టు చెత్త ఆటను చూశాక.. బ్రెండన్ మెక్‌కల్లమ్ స్థానంలో కొత్తవారికి బాధ్యతలు ఇవ్వాలనే డిమాండ్స్ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ కోచ్ రవి శాస్త్రి అయితేనే మంచిదని ఆ దేశ మాజీ స్పిన్నర్ మాంటీ పనేసర్ అభిప్రాయపడగా.. మాజీ కెప్టెన్ మాత్రం అలెస్టర్ కుక్ రేసులో ఉన్నాడని అంటున్నాడు.

యాషెస్ సిరీస్‌లో బ్యాటింగ్ వైఫల్యంతో ఇంగ్లండ్ చేజేతులా సిరీస్ సమర్పించుకుంది. హ్యాట్రిక్ ఓటములతో లొంగిపోయిన బెన్ స్టోక్స్ ఎట్టకేలకు మెల్‌బోర్న్‌లో విజయంతో మురిసినా.. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. దాంతో.. వెంటనే బ్రెండన్ మెక్‌కల్లమ్‌ను తప్పించాలని మాజీ ఆటగాళ్లు అంటున్నారు. తాజాగా ఆ జట్టు మాజీ కెప్టెన్ మైఖేల్ ఆర్థర్టన్ ది టైమ్స్ కథనంలో ఇంగ్లండ్ టెస్టు జట్టుకు కొత్త కోచ్ అవసరాన్ని నొక్కి చెప్పాడు. మెక్‌కల్లమ్ వారసుడిగా అలెస్టర్ కుక్ మంచి ఎంపిక అని అతడు పేర్కొన్నాడు.

'ఇదే విషయమై కుక్‌ను సంప్రదించగా అతడు నేను సిద్ధమే అని అంటున్నాడు. నేను ఏమీ చెప్పలేను. అయితే.. ఆర్థర్టన్ 800 పదాల ఆర్టికల్‌లో 600 పదాలే పూర్తి చేశాడు. ఇంకా 200 పదాలున్నాయి. ఇప్పటివరకైతే ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డు నన్ను సంప్రదించలేదు. ఒకవేళ నన్ను కోచ్‌గా ఎంపిక చేస్తే రఫ్ఫాడిస్తా. కచ్చితంగా ఫలితాలు చూపిస్తాను' అని కుక్ వెల్లడించాడు. ఇంగ్లండ్ దిగ్గజ ఆటగాళ్లలో ఒకడైన కుక్. 161 మ్యాచుల్లో 33 శతకాలు బాదాడు. క్రికెట్‌కు విశేష సేవలందించిన అతడికి 2019లో నైట్‌హుడ్ గౌరవం దక్కింది.

### శాస్త్రి ఎందుకంటే..?

ఒకప్పుడు 'బజ్ బాట'తో ప్రత్యర్థులను బెంబేలెత్తించిన ఇంగ్లండ్ యాషెస్ సిరీస్(ంబష్ట్రవబ ావతీతివబ)లో చతికిలపడింది. మళ్లీ ఇంగ్లండ్ గాడీలో పడాలంటే అది రవి శాస్త్రి వల్లే అవుతోందనిమాజీ స్పిన్నర్ మాంటీ పనేసర్ అంటున్నాడు. 'ఆస్ట్రేలియాను ఆస్ట్రేలియాలో ఓడించడం అతడికి తెలుసు. మానసికంగా, శారీరకంగా, వ్యూహాత్మకంగా ఆసీస్ ఆటగాళ్ల బలహీనతలను అతడు అనుకూలంగా మలచుకోగల సమర్థుడు. అందుకే.. బ్రెండన్ మెక్‌కల్లమ్ వెళ్లిపోయాక ఇంగ్లండ్ తదుపరి కోచ్‌గా రవిశాస్త్రి ఎంపికవ్వాలి.

# మాజీ కెప్టెన్‌కు చుక్కెదురు..

### బంగ్లాదేశ్ స్క్వాడ్‌లో సీనియర్ పేసర్..!



**ఢాకా:** పొట్టి ప్రపంచకప్ సన్నాహాల్లో ఉన్న బంగ్లాదేశ్ సీనియర్ పేసర్ తస్కిన్ అహ్మద్‌ను మళ్లీ స్క్వాడ్‌లోకి తీసుకుంది. స్వదేశంలో ఐర్లాండ్ సిరీస్‌కు దూరమైన తస్కిన్‌ను పొట్టి ప్రపంచకప్ కోసం ఎంపిక చేశారు. భారత్, శ్రీలంక ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీకి శనివారం బంగ్లా బోర్డు స్క్వాడ్‌ను ప్రకటించింది. లిటన్ దాస్ సారథిగా 15 మందితో కూడిన పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేశారు.

భారత్, శ్రీలంక వేదికగా ఫిబ్రవరి 7వ తేదీ నుంచి పురుషుల టీ20 ప్రపంచకప్ షురూ కానుంది. ఈ మెగా ఈవెంట్‌కు నెల రోజులే ఉండడంతో బంగ్లాదేశ్ బోర్డు స్క్వాడ్‌ను ఎంపిక చేసింది. లిటన్ దాస్ కెప్టెన్‌గా, మొహమ్మద్ సైఫ్ హ్పాసేన్ వైస్ కెప్టెన్‌గా 15 మందితో కూడిన బృందాన్ని తీసుకుంది. ఇటీవల ఆసియా కప్‌లో జట్టును నడిపించిన జకీర్ ఆలీపై వేటు పడింది. ఫామ్‌లో ఉన్న మాజీ కెప్టెన్ నజ్ముల్ హ్పాసేన్ శాంటోను సైతం సెలెక్టర్లు పక్కన పెట్టేశారు. గ్రూప్ సీలో ఉన్న బంగ్లాదేశ్ టోర్నీ ఆరంభం రోజే రెండుసార్లు విజేత వెస్టిండీస్‌తో తలపడనుంది. ఇదే గ్రూప్‌లో మాజీ ఛాంపియన్ ఇంగ్లండ్, నేపాల్, ఇటలీ ఉన్నాయి.

**బంగ్లాదేశ్ టీ20 ప్రపంచకప్ స్క్వాడ్ :** లిటన్ కుమార్ దాస్(కెప్టెన్), మొహమ్మద్ సైఫ్ హ్పాసేన్(వైస్ కెప్టెన్), తంజిద్ హసన్, పర్వేజ్ హ్పాసేన్, తౌహిద్ హృదయ్, షమీమ్ హ్పాసేన్, కాజీ నురుల్, మహేది హసన్, రిషద్ హ్పాసేన్, నసుమ్ అహ్మద్, ముస్తాఫిజుర్ రెహ్మాన్, తంజిమ్ హసన్, తస్కిన్ అహ్మద్, సైఫుద్దీన్, షొరిఫుల్ ఇస్లాం. ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఖండిస్తున్న భారత ప్రభుత్వం.. ఆ దేశంతో దౌత్య సంబంధాలకు బ్రేక్ వేసింది. అంతేకాదు బీసీసీఐ ఆదేశాల మేరకు ఐపీఎల్ నుంచి బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ తప్పించింది కూడా. దాంతో.. ప్రపంచకప్ కోసం భారత్‌కు వచ్చేందుకు కొన్ని షరతులు పెట్టనుంది బంగ్లా క్రికెట్ బోర్డు. మెగా టోర్నీ సమయంలో తమ ఆటగాళ్లు, మీడియా, స్పాన్సర్లకు భద్రత కల్పిస్తామని బీసీసీఐ హామీ ఇవ్వాలని బంగ్లా బోర్డు కోరనుంది.

# బాలీవుడ్‌లోకి ఆది సాయికుమార్ 'శంబాల'..

## హిందీ ట్రైలర్ రిలీజ్




**టాకీస్:** టాలీవుడ్ యువ నటుడు ఆది సాయికుమార్ బాలీవుడ్ ఎంట్రీకి సర్వం సిద్ధమైంది. ఆయన కథానాయకుడిగా నటించిన భారీ బడ్జెట్ సోషియో-ఫాంటసీ థ్రిల్లర్ 'శంబాల' హిందీ ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఇప్పటికే ఈ చిత్రం తెలుగులో విడుదలై మంచి హిట్ అందుకోవడమే కాకుండా రూ.20 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఇప్పుడు ఇదే చిత్రాన్ని హిందీలో విడుదల చేయబోతున్నారు మేకర్స్. తెలుగు నటులు వరుసగా పాన్ ఇండియా సినిమాలతో ఉత్తరాది ప్రేక్షకులను పలకరిస్తున్న తరుణంలో ఆది కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ఈ చిత్రానికి యుగంధర్ ముని దర్శకత్వం వహించారు.

ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇది 1980ల నాటి కథ. శంబాల అనే ఊర్లో ఓ ఉల్క పడుతుంది. ఆ ఉల్క పడిన నాటినుంచి ఆ ఊరిలో అన్నీ అపశకునాలు కనిపిస్తుంటాయి. దాంతో శాస్త్రాలను, దేవుళ్లనీ, దెయ్యాలనీ అమితంగా నమ్మే ఆ ఊరి జనం ఆ ఉల్కని 'బండ భూతం' అని పిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆ ఉల్కని స్టడీ చేసేందుకు సైంటిస్ట్ విక్రమ్(ఆది సాయికుమార్) ఆ ఊళ్లోకి అడుగుపెడతాడు. అతను సైన్స్‌ని మాత్రమే నమ్ముతాడు. ఊరిజనాల నమ్మకాలన్నీ మూఢ నమ్మకాలని అతని ఉద్దేశ్యం. ఆ ఉల్క పడిన నుంచి ఆ ఊరివాడైన రాములు(రవివర్మ) ప్రవర్తిస్తుంటాడు. ఓ ఆవుకు పాలు పిండబో పాలకు బదులు రక్తం కారుతుంటుంది. ఆ ఆవు చంపితే కానీ ఈ ఊరికి పట్టిన అరిష్టం పోదని ఊ జనాలు నిర్ణయించుకొని ఆ ఆవును చంపబోతుంటే విక్రమ్ అడ్డుకొని ఆ ఆవుని తనతోపాటు తీసుకెళ్తాడు. ఇక రాములు రోజురోజుకీ రాక్షసుడిలా మారుతుంటాడు. అడ్డొచ్చినవాళ్లందర్నీ చంపుకుంటూ పోతుంటాడు. ఓ దశలో విక్రమ్ మీదకు కూడా ఎగబడతాడు. తాడికి తెగబడతాడు. అసలు ఆ ఊళ్లో ఏం జరుగుతుంది? ఆ ఉల్క వెనుక ఉన్న కథేంటి? ఆ ఊళ్లో అలాంటి భయానకమైన సంఘటనలు జరగడానికి కారణమెవరు? సైన్స్‌ని మాత్రమే నమ్మే విక్రమ్ దేవుడ్ని మొక్కాడా? లేదా? ఈ ప్రశ్నలన్నిమటికీ సమాధానమే మిగతా కథ.

# 'సలార్' మిస్ అయినా 'రాజా సాబ్' తో కల నెరవేరింది!






**టాకీస్:** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సరసన 'ది రాజా సాబ్' సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది మలయాళీ ముద్దుగుమ్మ మాళవిక మోహనన్. జనవరి 9న ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో, ప్రమోషన్‌లో భాగంగా ఆమె ఒక ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలను వెల్లడించింది. నిజానికి ప్రభాస్ ? ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వచ్చిన 'సలార్' సినిమాలోనే ఆమె హీరోయిన్‌గా నటించాల్సిందట. శృతి హాసన్ చేసిన పాత్ర కోసం మొదట మాళవికనే సంప్రదించారని, ప్రశాంత్ నీల్‌ను కలిసి లుక్ టెస్ట్ కూడా ఇచ్చానని ఆమె తెలిపింది. అన్నీ అనుకూలించినట్టే అనిపించినా, కొన్ని కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ చేజారింది, ప్రభాస్ లాంటి స్టార్ హీరోతో డెబ్యూ చేసే ఛాన్స్ పోయినందుకు అప్పట్లో చాలా బాధపడ్డానని ఎమోషనల్ అయ్యింది. అయినప్పటికి ప్రభాస్ సినిమాతోనే తెలుగులోకి రావాలని తన విధిరాతలో రాసిపెట్టి ఉందని మాళవిక సంతోషం వ్యక్తం చేసింది. 'సలార్' అవకాశం పోయిన కొద్ది నెలలకే మళ్లీ 'రాజా సాబ్' కోసం పిలుపు వచ్చిందని, వెంటనే ఓకే చెప్పేశానని వివరించింది. ఈ సినిమాలో తాను 'భైరవి' అనే పాత్రలో నటిస్తున్నానని, ఇందులో గ్లామర్‌తో పాటు యాక్షన్ మరియు కామెడీ సీక్వెన్సులు కూడా ఉంటాయని పేర్కొంది. బాహుబలి కంటే ముందు నుంచే తాను ప్రభాస్ ఫ్యాన్ అని, తన కంటే తన తల్లికి ప్రభాస్ అంటే ఇంకా ఇష్టమని ఆమె సరదాగా చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె మాటలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.




# మెగా బ్లాస్ట్..

## చిరంజీవి 'మన శంకరవర ప్రసాద్ గారు' ట్రైలర్ విడుదల

**టాకీస్:** అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి, స్టార్ దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం 'మన శంకరవర ప్రసాద్ గారు'. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్ర బృందం ఆదివారం తిరుపతిలో గ్రాండ్‌గా విడుదల చేసింది. ట్రైలర్ అంతటా అనిల్ రావిపూడి మార్క్ కామెడీ, చిరంజీవి టైమింగ్ హైలైట్‌గా నిలిచాయి. చిరంజీవి తన వింటేజ్ కామెడీ అండ్ యాక్షన్ మేనరిజమ్స్‌తో అభిమానులను అలరించారు. ఈ సినిమాలో మరో విశేషం ఏమిటంటే, విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ట్రైలర్ చివరిలో వీరిద్దరి మధ్య వచ్చే సన్నివేశం థియేటర్లలో నవ్వుల పువ్వులు పూయించడం ఖాయమని ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. భీమ్స్ సిసిరోలియో అందించిన నేపథ్య సంగీతం అదిరిపోయింది.

# మళ్ళీ థియేటర్లలోకి అజిత్ ఆల్ టైం బ్లాక్ బస్టర్..

## జనవరి 23న 'మంకత్తా' రీ-రిలీజ్!




**టాకీస్:** తమిళ స్టార్ నటుడు అజిత్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన చిత్రం 'మంకత్తా'. ఈ సినిమా విడుదలైన సమయంలో బాక్సాఫీస్ వద్ద సృష్టించిన ప్రభంజనం అంతా ఇంతా కాదు. ఇప్పుడు అజిత్ అభిమానులకు ఒక భారీ తీపి కబురు అందిస్తూ, ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రీ-రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అధికారికంగా ప్రకటించింది.

అజిత్ 50వ చిత్రంగా వచ్చిన 'మంకత్తా' కోలీవుడ్‌లో ఒక కల్ట్ క్లాసిక్‌గా నిలిచిపోయిన విషయం తెలిసిందే. దర్శకుడు వెంకట్ ప్రభు తెరకెక్కించిన ఈ హై-స్టేక్ యాక్షన్ థ్రిల్లర్‌లో అజిత్ నటన, గెటప్ మరియు నెగటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టరైజేషన్ అభిమానులకు పూనకాలు తెప్పించాయి. అయితే ఈ సినిమాను మళ్లీ థియేటర్‌లలో విడుదల చేయబోతున్నారు మేకర్స్. ఈ సినిమాను జనవరి 23న ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. అజిత్‌తో పాటు అర్జున్ సర్జా, త్రిష, రాయ్ లక్ష్మి, అంజలి, ఆండ్రియా వంటి భారీ తారాగణం ఈ సినిమాలో నటించారు.

# 40 ఏళ్ల తర్వాత సౌత్ ఇండియా నుండి సైలెంట్ ఫిల్మ్

**టాకీస్:** వర్సటైల్ అంటే విక్రమ్‌లా గుర్తుపట్టకుండా గెటప్ మార్చనక్కర్లేదు సూర్యలా మేకోవర్ కానవసరం లేదు. జస్ట్ కథలో కొత్తదనం, నటనలో వైవిధ్యం చూపించొచ్చని ప్రూవ్ చేస్తున్నాడు విజయ్ సేతుపతి. ఏజ్‌కు తగ్గ సినిమాలు చేస్తూ మరో వైపు విలన్స్‌గానూ మెప్పిస్తున్నాడు ఈ స్టార్ హీరో. స్టోరీల్లో ఎక్స్‌పరిమెంట్ చేసే మక్కల్ సెల్వన్..మరో ప్రయోగానికి రెడీ అయ్యాడు. ఎప్పుడో కాలం చెల్లిపోయిన మూకీ సినిమాను తెస్తున్నాడు.




2021లో సేతుపతి ఎనౌన్స్ చేసిన సైలెంట్ మూవీ గాంధీ టాక్స్. షూటింగ్‌కు కొన్నాళ్ల క్రితమే గుమ్మడికాయ కొట్టేశారు. 2023 ఇండియా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్లో ప్రదర్శితమైంది కూడా. కానీ థియేటర్లలో రిలీజ్‌కు నోచుకోవడం లేదు. ఇన్నాళ్లకు మాటలు లేని సినిమాకు మోక్షం దక్కంది. ఏ ఆర్ రెహమాన్ మ్యూజిక్ అందిస్తున్న గాంధీ టాక్స్ జనవరి 30న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అరవింద్ స్వామి, అదితిరావ్ హైదరీ, సిద్దార్థ్ జాదవ్ కీ రోల్స్ పోషించిన ఈ మూకీ సినిమాకు కిషోర్ పాండురంగ్ బేలేకర్ దర్శకుడు. కమల్ హాసన్-అమల నటించిన పుష్పక విమానం తర్వాత ఇలాంటి సైలెంట్ మూవీ మరో సౌత్ హీరో, దర్శకుడు చేయలేదు. 1987లో సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో వచ్చిన పుష్పక విమానం అప్పట్లో పాన్ ఇండియాగా రిలీజై బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. కోటి రూపాయలను కొల్లగొట్టింది. మళ్లీ ఇన్నాళ్లకు అంటే దాదాపు 40 ఏళ్లకు విజయ్ సేతుపతి ఇలాంటి ప్రయోగానికి రెడీ అయ్యాడు. డబ్బు అనే కాన్సెప్ట్ చుట్టూ తిరగబోతుంది గాంధీ టాక్స్. మరీ ఈ ఎక్స్ పరిమెంట్ ఎంత వరకు వర్కౌట్ అవుతుందో తెలియాలంటే జనవరి ఎండింగ్ వరకు ఆగాల్సిందే.

# సత్య 'జెట్లీ' గ్లింప్స్ రిలీజ్..

## ఈ సారి కామెడీ మామూలుగా ఉండదు!

**టాకీస్:** 'మత్తు వదలరా' సినిమాతో టాలీవుడ్‌లో ఒక కొత్త తరహా కామెడీని పరిచయం చేసిన కాంబో మళ్ళీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కమెడియన్ సత్య హీరోగా యువ దర్శకుడు రితేష్ రానా రూపొందిస్తున్న సరికొత్త చిత్రం 'జెట్లీ'. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి తాజాగా గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సినిమా గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.




'మేడిపండు చూడ మేలిమై యుండును..' అనే వేమన పద్యంతో ఈ గ్లింప్స్ ప్రారంభం అయ్యింది. ఒక ఫ్లైట్ హైజాక్ నేపథ్యంలో సాగే ఈ కామెడీ సన్నివేశాలు గ్లింప్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా వెన్నెల కిషోర్, సత్య మధ్య వచ్చే సంభాషణలు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తున్నాయి. "నువ్వు ఏ టైర్ హీరోవి?" అని వెన్నెల కిషోర్ వేసిన ప్రశ్నకు, సత్య తనదైన శైలిలో "నేను జనరల్ కంపార్ట్‌మెంట్ హీరోని" అంటూ సమాధానం ఇవ్వడం సినిమాపై అంచనాలను పెంచుతోంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.